


# విజయభాను

విజయవాడ, ఆదివారం 03-09-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 91 పేజీలు : 8 వెల : 1 రూపాయి



## మున్సిపల్ పాఠశాలల బలోపేతానికి మరింత కృషి

### మంత్రి నారాయణ

విజయవాడ: నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఫౌండేషన్ కోర్సును మరింత బలోపేతం చేయడంతో పాటు, అత్యధిక శాతం విద్యార్థులు ఆయా కోర్సుపట్ల తరువాయి 2లో

## నేడే మంత్రివర్గ విస్తరణ

### విశాఖ ఎంపీ హరిబాబుకు స్థానం?

దిల్లీ : కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై మంతనాలు కొనసాగుతున్నాయి. మంత్రివర్గ విస్తరణకు వీలుగా ఇప్పటికే ఏడుగురు మంత్రులు రాజీనామా సమర్పించిన విషయం తెలిసిందే. మరో ఐదుగురు మంత్రులు కూడా రాజీనామా చేసే అవకాశాలు తరువాయి 2లో



## మరణాలు తగ్గించేందుకే శిరస్త్రాణం

### అవగాహన ప్రదర్శనలో కలెక్టర్ లక్ష్మీకాంతం



విజయవాడ: ద్విచక్రవాహన రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించటమే లక్ష్యంగా శిరస్త్రాణం విధిగా ధరించాలనే నిబంధన అమలు చేస్తున్నట్లు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం పేర్కొన్నారు. కలెక్టర్ విడిది కార్యాలయం నుంచి రవాణా, పోలీసు తరువాయి 2లో



# వైఎస్ఆర్‌కు కుటుంబ సభ్యుల ఘన నివాళి

**- ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన వైఎస్ జగన్, కుటుంబ సభ్యులు**

**- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఏపీ ప్రతిపక్షనేత**



కడప: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 8వ వర్థంతిని ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్దకు శనివారం ఉదయాన్నే వైఎస్ఆర్‌సీపీ అధినేత, ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్ భారతిరెడ్డి, సోదరి షర్మిల, బ్రదర్ అనిల్ కుమార్, వైఎస్ వివేకానందరెడ్డి, వైఎస్ఆర్ సోదరుడు దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వైఎస్ఆర్ ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కాగా వైఎస్ఆర్ భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో మాత్రం ఆయన ఇంకా బతికే ఉన్నారని వైఎస్ జగన్ ఈ సందర్భంగా ట్విట్ చేశారు.

అనంతరం వైఎస్ జగన్ వేంపల్లెలో ఓ ప్రయివేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన గ్రామంలోని రామాలయాన్ని సందర్శించారు.

కాగా మధ్యాహ్నం మూడు గంటలకు పులివెందులలోని భాకరాపురంలో వైఎస్ఆర్ ఆడిటోరియంలో వైఎస్ కుటుంబం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.



## అక్టోబర్ 27 నుంచి పాదయాత్ర: జగన్

పులివెందుల: నంద్యాల ఉప ఎన్నికలో తెదేపాపై అభిమానంతో ప్రజలు ఓట్లు వేయలేదని, ఓటు వేయకపోతే పింఛన్లలో కోత విధిస్తామంటూ బెదిరించి వేయించుకున్నారని వైకాపా అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. అక్టోబర్ 2 వరకు వైఎస్ఆర్ కుటుంబం కార్యక్రమం జరుగుతుందన్నారు. అక్టోబర్ 27 నుంచి ఆరు నెలల పాటు పాదయాత్ర కొనసాగుతుందని జగన్ స్పష్టంచేశారు. ఈ పాదయాత్రలో ప్రతి వైఎస్ఆర్ కార్యకర్త ఏకం కావాలని, తనకు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ కుటుంబం కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

## యువీ.. ఇలాగే కొనసాగించు : మోదీ

దిల్లీ: టీమిండియా ప్రపంచకప్‌ల హీరో యువరాజ్ సింగ్‌కు స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేఖ పంపించారు. దాన్ని చూసిన యువీ తొలుత ఆశ్చర్యపోయాడు. సమాజానికి సేవ చేయడం కొనసాగించాలన్న ప్రధాని వ్యాఖ్యలతో మరింత ప్రేరణ పొందినట్టు తెలిపాడు.

భారత్‌లో 2011 ప్రపంచకప్ ఆడేటప్పుడు యువీ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఇబ్బందిపడుతునే విలువైన ఇన్నింగ్స్‌లు ఆడి దేశమంతా 28 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రపంచకప్ అందించాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. క్యాన్సర్ మహమ్మారిని ఓడించి మళ్లీ తనకిష్టమైన క్రికెట్‌లో అడుగుపెట్టి విజేతగా నిలిచాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులు, పేదల కోసం యూవీకెన్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి తొలిదశలోనే క్యాన్సర్‌ను గుర్తించే సేవలు అందిస్తున్నాడు. చిన్నారులకు వైద్యసాయం అందిస్తూ వారిలో స్థైర్యం నింపుతున్నాడు. యువీ చేస్తున్న సేవలకు మెచ్చిన ప్రధాని మోదీ లేఖ పంపారు. సేవల్ని ఇలాగే కొనసాగించాలని కోరారు. దాన్ని యువరాజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు.

## వైవిధ్యంగా హులిగమ్మ శరవన్నవరాత్రులు

గంగావతి : సుప్రసిద్ధ హులిగమ్మదేవి శరవన్నవరాత్రులను ఈ ఏడాది వైవిధ్యభరితంగా ఆచరించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. ఏర్పాట్లపై ఆయన ఆలయ సమితి సభ్యులతో సమావేశమై చర్చించారు. 21న ఘటస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 10 రోజుల పాటు నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 25న లలిత పంచమి పురస్కరించుకుని చండికాహోమం, శార్దూల సేవ జరుగుతుందన్నారు. 26న సింహ, 27న మయూర, 28న దుర్గాష్టమి, గజ వాహన సేవలు జరుగుతాయన్నారు. మహానవమి నాడు ఘట నిమజ్జనం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో రమేశ్ వైద్య, దత్తూరావ్ దేశాయ్, విజయకుమార్ పాల్గొన్నారు.

## ఈ ప్రేమకు అర్హుడినా అనుకున్నా : పవన్



హైదరాబాద్: అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ అభిమానులను ఉద్దేశించివరుస ట్వీట్లు చేశారు. తనపై కురిపిస్తున్న ప్రేమ, అభిమానానికి ధన్యవాదాలు చెప్పారు. నేను నా పుట్టినరోజును జరుపుకోను.. కానీ మీరు సెలబ్రేట్ చేస్తారు. చాలా గౌరవంగా భావిస్తుం టా. నన్ను నేను చూసుకుని.. ఇంత ప్రేమకు నేను అర్హుడినా అని ప్రశ్నించుకున్నా. నేను ఐదుగురు సభ్యులున్న కుటుంబం నుంచి వచ్చా.. దేవుడు నాకు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది సభ్యులున్న పెద్ద కుటుంబాన్ని ఇచ్చాడు. నేను కష్టాల్లో ఉన్నప్పుడు నాకు కొండంత అండగా ఉన్నారు.

నాకు మీ పట్ల ఉన్న శాశ్వతమైన ప్రేమ, కృతజ్ఞతలను తెలియజేస్తున్నా అని పవన్ ట్వీట్లు చేశారు.

పవన్ ప్రస్తుతం తన 25వ చిత్రం షుటింగ్‌లో బిజీగా ఉన్నారు. త్రివిక్రమ్ దర్శకుడు. కీర్తి సురేశ్, అను ఇమ్మాన్యుయెల్ కథానాయికలు. వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పవన్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఈ చిత్రం పోస్టర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## డేరా బాబాకు మరో షాక్



న్యూఢిల్లీ: అత్యాచార కేసులో 20ఏళ్ల కారాగార శిక్షకు గురైన డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ సింగ్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇండియన్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీడీఏ), సినీ అండ్ టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(సీఐఎన్‌టీఏఏ)లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఆయన గానీ, హనీప్రీత్ కౌర్ గానీ భవిష్యత్‌లో ఎలాంటి సినిమాలు తీయకుండా వారి సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపాయి. ఈ మేరకు ఐఎఫ్‌టీడీఏ అధ్యక్షుడు అశోక్ పండిట్ ప్రకటించారు.

ఇక రామ్ రహీమ్ ఇండియన్ ఫిల్మ్ అండ్ టెలివిజన్‌తో పనిచేయలేరు. ఐఎఫ్‌టీడీఏ ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాం అని పండిట్ స్పష్టం చేశారు. ఇండియన్ మోషన్ పిక్చర్స్ పొడ్యూసర్స్ అసోసియేషం (ఐఎంపీఏఏ)లో రామ్ రహీమ్‌కు ఉన్న సభ్యత్వాన్ని కూడా రద్దు చేశారు. మా సంస్థల్లో హుందా, గౌరవ మర్యాదలతో కూడిన వ్యక్తులు ఉన్నారు. నేరస్థులకు ఇందులో చోటు లేదు. న్యాయస్థానం ఆయన విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో జరిగిన అలర్ల కారణంగా ఎంతోమంది చనిపోయారు అని పండిట్ తెలిపారు.

రామ్ రహీమ్ 2015లో తన సినీ జీవితాన్ని ప్రారంభించారు.

ఎంఎస్‌జీ: ది మెసెంజర్, ఎంఎస్‌జీ-2, ఎంఎస్‌జీ: ద వారియర్ లయన్ హార్ట్, హింద్ కా నాపక్ కో జవాబ్, జట్టూ ఇంజినీర్ చిత్రాల్లో ఆయన నటించారు.

**మొదటి పేజీ తరువాయి**

## నేడే మంత్రివర్గ విస్తరణ

కనిపిస్తున్నాయి. దత్తాత్రేయ రాజీనామాతో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం లేనట్లే కనిపిస్తోంది. ఇక్కడి నుంచి సీనియర్ నేత మురళీధర్‌రావు పేరు వినిపిస్తున్నా.. పార్టీ వర్గాలు ధ్రువీకరించలేదు. అటు ఆంధ్రప్రదేశ్ నుంచి కంభంపాటి హరిబాబుకు మంత్రి పదవి ఇవ్వడంపైనా సందిగ్ధత కొనసాగుతోంది.

ఉత్తర్రపదేశ్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌లకు కేంద్రమంత్రివర్గంలో ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. శాసనసభ ఎన్నికల దృష్ట్యా గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లకు అధిక ప్రాధాన్యం దక్కనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగవత్‌తో భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా చర్చించినట్లు సమాచారం. మరోవె%పు నిన్న రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ నివాసంలో సీనియర్ మంత్రులు సమావేశమై ప్రస్తుత పరిణామాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, నితన్‌గడ్కరీ పాల్గొన్నారు.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై పూర్తి కసరత్తు అనంతరం ఈరోజు మధ్యాహ్నం తర్వాత మంత్రివర్గంలోకి తీసుకునేవారికి పీఎంవో సమాచారం ఇవ్వనుంది. పునర్వ్యవస్థీకరణలో పలు కీలక శాఖల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

## మున్సిపల్ పాఠశాలల బలోపేతానికి మరింత కృషి

తగిన ఆసక్తి చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ మంత్రి నారాయణ సూచించారు. విజయవాడలోని పలు మున్సిపల్ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి విద్యార్థులతో భేటీ అయ్యారు. ఫౌండేషన్ కోర్సుపట్ల విద్యార్థులను మరింత ఆసక్తిచూపేలా చేయడంలో ఉపాధ్యాయులు, అధికారులు విఫలం కావడం, ఎక్కువమందిని ఈ ఏడాది కోర్సులో చేర్పించలేకపోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మున్సిపల్ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు, పోటీపరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు, ఆశయాలకు గండికొట్టొద్దని ఉపాధ్యాయులు, అధికారులను హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్లబోధనతో ఆధునికంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఫౌండేషన్ కోర్సు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం రాజీవ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంత్రి సందర్శించారు. ఒకే కేంద్రంలో నర్సరీ, ఎల్‌కెజి, యూకేజీ తరగతులు నిర్వహించడం, గదులను రంగులతోతీర్చిదిద్దడం, బల్లలు, ఆట పరికరాలు అందుబాటులోకి తేవడంపై అభినందించారు.

## మరణాలు తగ్గించేందుకే శిరస్త్రాణం

శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన శిరస్త్రాణాలపై అవగాహన ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఇటీవల కృష్ణా జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలు తగ్గాయని పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాలతో ఇది సాధ్యమైందన్నారు. అయితే మరణాల సంఖ్యను పూర్తిగా తగ్గించడమే తమ లక్ష్యమన్నారు. డీసీపీ కాంతిరాణా టాటా మాట్లాడుతూ జాతీయ రహదారులపై పోలీసు వాహనాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించామన్నారు. ఉపరవాణా కమిషనర్ ఇ.మీరాప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రవాణాశాఖ ప్రత్యేకచర్యలు చేపట్టిందని అన్నారు. అనంతరం హెల్మెట్ల వినియోగంపై కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

**శిరస్త్రాణం ధరించి.... బుల్లెట్లపై వెళుతూ....**

హెల్మెట్లపై అవగాహన కలిగించేందుకు జిల్లా అధికారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, డీసీపీ కాంతిరాణాటాటా, ఉపరవాణా కమిషనర్ ఇ.మీరాప్రసాద్ తదితరులు బుల్లెట్ వాహనాలపై ప్రదర్శన నిర్వహించారు. వీరు ముందు వెళుతుండగా వెనుక హెల్మెట్లు ధరించిన వాహనచోదకులు బయలుదేరారు. రవాణాశాఖ, పోలీసుశాఖలకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేన్సర్ నియంత్రణపై చైతన్య ర్యాలీ




బరగఢ్ : జిల్లాలో కేన్సర్ వ్యాధి నియంత్రణకు మార్వాడీ యువమంచ్ నడుం కట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చైతన్య ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. పొగాకు వాడొద్దు, పాలిథీన్ నిషేధించాలని నానాదాలు చేశారు. అనంతరం ఎరువులు వాడకుండా సాగుచేసే రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండు చేస్తూ కలెక్టర్ ఖగేంద్రనాథ్ పాడికి వినతిపత్రం అందించారు. అంతకు ముందు ఎంపీ ప్రభాస్‌సింగ్ ర్యాలీ ప్రారంభించారు.

## ఆత్మహత్యల నివారణకు మనోధైర్యం కల్పించండి

**పోలీసు అధికారులకు డిజిపి దిశానిర్దేశం**

బెంగళూరు : ఆత్మహత్యలకు పాల్పడాలనుకునే వారికి మంత్రణ (కౌన్సెలింగ్) ఇస్తూ, వారిలో ధైర్యం నింపేందుకు ప్రయత్నించాలని డీజీపీ ఆర్.కె.దత్తా సూచించారు. శుక్రవారం ఇక్కడ డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు ఉత్తర్వులు పంపారు. రాష్ట్రంలో ఇటీవల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, చిన్నసమస్యల్ని తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని గుర్తించి ధైర్యం నింపాలని సూచించారు. ఆత్మహత్యలకు కారణాలు గుర్తించి వాటిపై ప్రజల్ని జాగృత పరచాలని అన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి పరీక్షల్లో ఉత్తీర్ణులు కానివారిని, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. వృద్ధాశ్రమాలకు వెళ్లి వృద్ధుల సమస్యల పరిష్కారానికి శ్రమించాలన్నారు. మానసిక వ్యాధిగ్రస్థుల్ని గుర్తించి జనస్నేహి, మనె-మనెగె పోలీసు కార్యక్రమాల్లో కౌన్సెలింగ్ ఇవ్వాలని, పోలీసు సహాయవాణి, బాలలు, మహిళ సహాయవాణికి వచ్చే ఫిర్యా దుల్ని తీవ్రంగా పరిగణించాలని ఆదేశిం చారు. కుటుంబ సమస్య లకు సంబంధించి భార్యా భర్తలకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఆత్మహత్యల నియంత్రణ కోసం చేపట్టే కార్యక్రమాలపై నెలకు ఓసారి తనకు నివేదికల్ని పంపించాలని, పైఅధికారులు పాల్గొనే విధంగా కార్యక్రమాల్ని రూపొం దించాలని డి.జి.పి. దత్తా సూచించారు.

## అనుబంధ సంస్థలను ప్రోత్సహించండి



రాయగడ : ఒక భారీ పరిశ్రమ ఏర్పడితే దాని పరిసరాల్లో ఎన్నో చిన్న అనుబంధ సంస్థలు ఏర్పడతాయని, అందుకే భారీ పరిశ్రమల యాజమాన్యం అందుబాటులో ఉన్న అను బంధ సంస్థల ఉత్పత్తులను కొని వారిని ప్రోత్స హిస్తే మరిన్ని చిన్న పరిశ్రమలు వస్తాయని పాలనాధికారిణి పూనంగుహ అన్నారు. శుక్రవారం కలెక్టొరేట్ సద్భావన సమావేశ గృహంలో జిల్లాలో భారీ పరిశ్రమల సీఈఓలు, నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యం మానవ వనరుల వినియోగంలో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు స్థానిక చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. మేకిన్ ఒడిశాలో భాగంగా ప్రభుత్వం చిన్న పరిశ్రమల స్థాపనకు యువతను ప్రోత్సహిస్తూ సంస్థల స్థాపనకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తుండగా వారి ఉత్పత్తులకు గిరాకీ లేక ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయలేక ఇబ్బందులు పడకూడదన్నారు. అనంతరం భారీ పరిశ్రమల స్థితిగతులు, సమస్యలు, ఉత్పత్తి, మానవవనరుల వినియోగం, కార్మిక సంక్షేమం, చట్టాల అమలు వంటి విషయాలపై చర్చిం చారు. కార్యక్రమంలో జె.కె.పేపర్‌మిల్లు కార్య నిర్వహణ ఉపాధ్యక్షుడు పి.కె.సూరి, ప్రాంతీయ పరిశ్రమల కేంద్రం జీఎం బీరేంద్ర కొర కొరియా, రాయగడ, గుణుపురం సబ్‌కలెక్టర్‌లు ప్రబీర్ నాయక్, బసంత్‌కుమార్ సాహు, పోలీసు, అటవీ విభాగాల అధికారులు, ఐపీఓ సవ్యశాచిసాహు, ఇంఫా, వేదాంతా, ఉత్కళ అల్యూమినా తదితర భారీ పరిశ్రమల సీఈఓలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

## సమన్వయంతోనే రహదారి ప్రమాదాల నివారణ : కలెక్టర్ వినయ్‌చంద్

ఒంగోలు : జిల్లాలో రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంలో పని చేయాలని కలెక్టరు వినయ్‌చంద్ సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో రహదారి భద్రత జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో 864 ప్రమాదాల్లో 342 మంది, 2017లో 831 ప్రమాదాల కారణంగా 319 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు. మద్యం తాగడం, నిద్రమత్తు కారణంగానే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.

డ్రైవర్లు ఈ విషయాలపై అప్ర మత్తంగా ఉండాలని కోరారు. మార్టూరులోని రాజుపాలెం, టంగు టూరు టోల్‌ప్లాజా వద్ద గుర్తించిన పార్కింగ్ స్థలాలను వినియోగం లోకి తీసుకురావాలని ఆదేశించారు. మేదరమెట్ల వద్ద కొండచరియలు విరిగి పడుతున్న ప్రాంతంలో అప్రమత్తం చేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

## రొట్టెల పండుగకు జాతీయ గుర్తింపు తెస్తాం:మేయర్



నెల్లూరు : మతసామరస్యానికి ప్రతీకైన రొట్టెల పండుగ నిర్వహణను మరింత అభివృద్ధి పరచి జాతీయస్థాయి పండుగలా గుర్తింపు తెచ్చేందుకు కృషి జరుగు తోందని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. బక్రీద్ పండుగ ప్రత్యేక ప్రార్థనల కోసం బారాషహీద్ దర్గా ఈద్గా ప్రాంగణాన్ని అన్ని సౌకర్యాలతో సంసిద్ధం చేస్తున్న తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యం పెంచే విధంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యమిస్తూ నగరంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది రూ.47 లక్షలతో నగరంలో బారాషహీద్, నజీర్‌తోట, బర్మాషెల్‌గుంట, అహ్మద్‌నగర్, సంతపేట, ఇతర ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులను బక్రీదు పండుగ ప్రత్యేక ప్రార్థనల కోసం సిద్ధం చేశామని తెలిపారు. బారాషహీద్ ఈద్గాలో 90వేల చదరపు అడుగుల వాటర్ ప్రూఫ్ షెడ్డు, సీలింగ్ ఫ్యాన్లు, జంఖానాలను ప్రార్థనల కోసం ఏర్పాటు చేశామని వివరించారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఈదుల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని వివరించారు. కోటమిట్ట షాదీ మంజిల్‌ను రూ.5 కోట్లతో నిర్మాణ పనులను త్వరలో చేపట్ట బోతున్నామని తెలిపారు. నగరంలో మహిళా వైద్యశాలను నిర్మించేందుకు కృషి చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణలతో చర్చలు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా ఇమామ్ అబూబకర్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చాట్ల నరసింహారావు, నాయకులు సయ్యద్ సమిహుస్సేని, ఖాజావలి, నన్నేసాహెబ్, జాఫర్ మొహిద్దీన్, రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూములను యదావిధిగా ఉంచండి

కొడవలూరు : మండలంలోని బొడ్డువారి పాళెం రెవెన్యూ పరిధిలోని చంద్రశేఖరపురల ఓ రైతుల భూములను యధావిధిగా ఉంచాలని హైకోర్టు న్యాయమూర్తి ఏ.రామలింగేశ్వరావు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేశారు. ఇటీవల ఏపీఐఐసీ స్వాధీనం చేసుకున్న రైతుల భూములను 2013. భూసేకరణ చట్టం అనుసరించకుండా ఎకరానికి కేవలం రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించడాన్ని ప్రశ్నిస్తూ లబ్ధిదారులైన రైతుల మస్తానమ్మ, టి.తిరుపతయ్య ఆధ్వర్యంలో 34 మంది హైకోర్టులో కేసు వేశారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది రామచంద్రరావు రైతుల పక్షాన కోర్టులో వాదనలు వినిపించారు. దీంతో హైకోర్టు న్యాయమూర్తి రామలింగేశ్వరావు రైతుల భూములను యధావిధిగా వారి ఆధీనంలో ఉంచాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వం, జిల్లా కలెక్టరు, ఆర్డీవో, తహశీల్దారు, ఏపీఐఐసీ ఛై%ర్మన్, జోనల్ మేనేజర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ కేసు విచారణకు మరో నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవే భూములపై గతంలో రెండు సార్లు రైతుల ఫిర్యాదు మేరకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రైతు సంఘాల నాయకులు కొడవలూరు జడ్పీటీసీ సభ్యులు ఇరువూరు శ్రీధర్‌రెడ్డి, బెజవాడ గోవింద్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి బాధిత రైతులకు అండగా పోరాటం చేస్తున్నారు.

## రాష్ట్రంలో 15 యార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

### మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ శామ్యూల్ ఆనంద్



ఆదోని : రాష్ట్రవ్యాప్తంగా 15 మార్కెట్ యార్డులను ఆదర్శ మార్కెట్ యార్డులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ శామ్యూల్ ఆనంద్ తెలిపారు. ఆయన శుక్రవారం ఆదోని యార్డు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 13 జిల్లాలో జిల్లాకు ఒక్కొటి చొప్పున యార్డును మోడల్ యార్డులుగా తీర్చిదిద్దుతామన్నారు. కర్నూలు జిల్లాలో ఆదోని యార్డును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 2017-18 ఏడాదికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డుల ద్వారా రూ.550 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టు కున్నామన్నారు. గతేడాది రూ.476 కోట్లు వచ్చిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించాలన్నదే తమ ఏకైక లక్ష్యమన్నారు. కేంద్ర... రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగ స్వామ్యంలో రాష్ట్రంలో 119 మార్కెట్ యార్డులు ఉండగా 22 యార్డులలో ఈ-నామ్ విధానం ప్రవేశ పెట్టామన్నారు. పూర్తిగా అంతర్జాల సేవల ద్వారానే వ్యాపార వ్యవహారాలు సాగుతా యన్నారు. రైతులకు సైతం అంతర్జాలం ద్వారా నగదు చెల్లింపులు చేయాలని, ఇప్పటికైతే ఇది జరగడం లేదన్నారు. మార్చి 2018 నాటికి తప్పని సరింగా వంద శాతం అంతర్జాల చెల్లింపులు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొ న్నారు. ఎక్కడికక్కడ అవసరమైన రీతిలో పనులు మంజూరు చేస్తున్నామన్నారు. అనం తరం ఆదోని యార్డులో రూ.49 లక్షలతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరా కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేడీ సుధా కర్, డీడీఎం లావణ్య, ఏడీ సత్య నారా యణ చౌదరి, కార్యదర్శి రామారావు, డీఈ సుబ్బారెడ్డి, ఆదిశేషు, సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 2019లో అధికారం మాదే : జనార్ధన్

ఒంగోలు : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెదేపా విజయంపై జిల్లా తెదేపా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లోనూ రాష్ట్రంలో తెదేపానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఇటీవల జరిగిన నంద్యాల ఫలితాలు, ఈ రోజు కాకినాడ ఫలితాలే అందుకు నిదర్శన మన్నారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పది టీఎంసీల నీటిని అడగ్గా... దానిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గుండ్లకమ్మ నుంచి 1.2 టీఎంసీలు నీటిని పంపింగ్ ద్వారా ఏడుగుండ్లపాడుకు..

అక్కడి నుంచి ఒంగోలుకు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో తెదేపా నాయకులు శాసనాల వీర్రబహ్మం, మహిళా నాయకులు అనంతమ్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.నాగేశ్వరరావు, డి.ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎదిగే వయస్సులో పౌష్టికాహారం ముఖ్యం

### స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ టి.వి.శ్రీనివాస్

ఒంగోలు : శారీరక ఆరోగ్య సమతౌల్యం కోసం ప్రతి ఒక్కరూ సరైన పౌష్టికాహారం తీసుకోవడం ముఖ్యమన్న అవగాహన కల్పిస్తూ జాతీయ పోషకాహార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ టి.వి.శ్రీనివాస్ తెలిపారు. ఒంగోలులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల ఎత్తు, బరువు ఆధారంగా వారి శరీర సౌష్టవాన్ని అంచనా వేస్తామన్నారు. వారం రోజులపాటు పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీడీ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పిల్లల ఎత్తు, బరువును పరిక్షించారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



దగదర్తి : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు సూచించారు. శుక్రవారం మనుబోలుపాడులో పర్యటించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ నలభై రోజులుగా గ్రామంలో వ్యాధులు విస్తరిస్తుంటే ఏంచేస్తున్నారని డీఎంహెచ్ఓ వరసుందరం , జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.వెంకట ప్రసాద్‌లను ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో గొంతు వద్ద గడ్డలతో పలువురు బాధపడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి వివరించారు. 32 మందికి ఈ వ్యాధి లక్షణాలు బయటపడగా 12 మందికి టీబీ ఉన్నట్లుగా గుర్తించామన్నారు. వారికి ఆరు నెలల పాటు టీబీ మందులను వైద్యసిబ్బంది పర్యవేక్షణలో ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడా ఇంతమందికి టీబీ సోకలేదని చెప్పారు. జిల్లాలో ఒక్క దగదర్తి మండలంలోనే ఇంత మందికి టీబీ వ్యాధి రావడం గుర్తించామన్నారు. అనంతరం జరిగిన సభలో కలెక్టరు ముత్యాల రాజు మాట్లాడుతూ ప్రస్తుతం కాలాను గుణ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. గ్రామంలోని టీబీ వ్యాధిగ్రస్థుల్లో ఎక్కువమంది మధుమేహంతో బాధపడుతున్నారన్నారు. వారంతా ఇన్‌ఫెక్షన్ కాకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. ముందుగా వారు మధుమేహ వ్యాధిని నియంత్రించుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. రాజధాని నిర్మాణ సలహా మండలి సభ్యులు మస్తాన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే మందులను సక్రమంగా వాడి వ్యాధిని తగ్గించుకోవాలన్నారు. డీఎంహెచ్ఓ వర సుందరం మాట్లాడుతూ గ్రామంలో 12 మందికి టీబీ వ్యాధి సోకినట్లు పరీక్షల్లో తేలిందన్నారు. వీరంతా ఆరునెలల పాటు మందులు వాడాల్సి ఉంటుందన్నారు. జిల్లా క్షయ నియత్రణ అధికారి వెంకటప్రసాద్ మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్థులు బలవర్ధక ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి నాలుగో శనివారం గ్రామంలో 104 వాహనం సేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో కావలి ఆర్డీఓ భక్తవత్సలరెడ్డి, తహశీల్దార్ జయప్రకాష్, ఎంపీడీఓ పరంధామయ్య, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరక్టర్ రవీంద్రనాయుడు, తెదేపా నాయకులు రవి కుమార్‌చౌదరి, రవీంద్రనాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారుల శ్రేయస్సే ధ్యేయం



కాకుటూరు : పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం హెరిటేజ్ సంస్థ రైతు సంక్షేమ నిధి ద్వారా అనేక పథకాలను ప్రవేశపెట్టినట్టు ఆ సంస్థ ఛైర్మన్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కాకుటూరులోని హెరిటేజ్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులకు బీమా సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. పాల సేకరణ పెంపుపై సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఆ సంస్థ బ్రాంచి మేనేజర్ దామచర్ల లక్ష్మీనారాయణ, ప్రకాశం కళాశాల నిర్వాహకులు కంచర్ల రామయ్య, కందుకూరు జడ్పీటీసీ సభ్యుడు కంచర్ల శ్రీకాంత్, ఆ సంస్థ ఒంగోలు జీఎం రామసుబ్బారావు, ఏరియా మేనేజర్ శేషగిరిరావు, బ్రాంచి సిబ్బంది ఉన్నం నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

### పంచాయతీ కార్యదర్శులకు సిమ్‌కార్డులు

ఒంగోలు : జిల్లాలోని 540 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం తరుపున ఉచితంగా సెల్‌ఫోన్ సిమ్‌లు అందచేసినట్లు డీపీవో ఎన్ఎస్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.నెలకు పంచాయతీరాజ్‌శాఖ తరుపున రూ.150 చెల్లిస్తామని, బిల్లులో మిగతా మొత్తం సంబంధిత కార్యదర్శులే పెట్టుకోవాల్సి ఉంటుందన్నారు.

## బోధనాసుపత్రులకు రోగుల తాకిడి

కర్నూలు : రాష్ట్ర వ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, వైద్య సౌకర్యాలు పెరగడంతో రోగుల సంఖ్య ఓపీకి వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని డీఎంఈ సుబ్బారావు అన్నారు. సర్వజన వైద్య శాలలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఆర్ఐ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని ఆసుపత్రి పర్యవేక్షకులు డా.చంద్రశేఖర్, డా.రామప్రసాద్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వైద్యులు అందరికీ పదోన్నతులు కల్పించామని, రాబోయే రోజుల్లో కొత్త నియామకాలు చేపడతామని చెప్పారు. కర్నూలు ఆసుపత్రిలో రాష్ట్రస్థాయి క్యాన్సర్ యూనిట్ త్వరలో ప్రారంభిస్తామని, అత్యవసర యూనిట్ కొత్తగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## అంగన్‌వాడీ ప్రీస్కూల్ పిల్లలకు ట్యాబ్‌లు

- నగర పరిధిలోని పాఠశాలల్లో అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్సులు
- పురపాలకశాఖ మంత్రి నారాయణ



ఒంగోలు : పట్టణాలు, నగరాల్లో కొత్తగా ప్రారంభించిన అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలందరికీ ఉచితంగా ట్యాబ్‌లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శుక్రవారం ఒంగోలుకు వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అధునాతన పద్ధతులతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ స్కూళ్లకు తల్లిదండ్రుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. పిల్లలకు నేర్పే రైమ్స్, పాటలు, ఆటలతో రూపొందించిన సిమ్‌కార్డులను ట్యాబ్‌లో అమర్చి పిల్లలకు ఇస్తామన్నారు. వాటిని ఇంట్లో కూడా వినియోగించవచ్చన్నారు. తల్లిదండ్రులు ఇంట్లో ట్యాబ్‌ల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పించవచ్చన్నారు. నెల రోజుల్లో అన్ని పాఠశాలలకు అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఒంగోలులో 72 అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేసి 24 పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేరుగా పురపాలకశాఖ నుంచే..

ఒంగోలు నగర పరిధిలో ఉన్న జిల్లా పరిషత్తు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ కోర్సులు ప్రారంభించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న నాలుగు ఉన్నత పాఠశాలల్లో ఈ కోర్సు అమలులో ఉందన్నారు. కొత్తగా నగర పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకూ ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన నిధులను నేరుగా పురపాలకశాఖ నుంచి మంజూరు చేస్తామన్నారు. దశల వారీగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలనే ఆలోచన ఉందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో పురపాలకశాఖ ఆధ్వర్యంలో ఒక జూనియర్ కళాశాల నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. నెల్లూరులో ఇప్పటికే ప్రారంభించామన్నారు. వచ్చే ఏడాది ఒంగోలులో ప్రారంభమవుతుందన్నారు. ప్రాజెక్టులో నీరు లేకపోవడం వల్ల రాష్ట్రంలో చాలా పట్టణాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. జిల్లాలో మార్కాపురానికి రూ.అయిదు కోట్లు, గిద్దలూరుకు రూ.మూడు కోట్ల నిధులను ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు అందజేశమన్నారు. ఒంగోలుకు గుండ్లకమ్మ ద్వారా రోజుకు 7 ఎం.ఎల్.నీటిని రాబట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, దాంతో సమస్య కొంత మేరకు తీరుతుందన్నారు. ఈలోపు సాగర్ నీరు వస్తుందని భావిస్తున్నామని అన్నారు. ఒంగోలు సమీపంలో కొన్ని వ్యవసాయ బోర్లను కూడా నగరంలో నీటి సరఫరాకు వినియోగిస్తున్నామని అన్నారు.

తన పర్యటనలో భాగంగా పురపాలకశాఖ మంత్రి నారాయణ నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ, డీఈవో విజయభాస్కర్, అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలల సమన్వయకర్త భాగ్యలక్ష్మి, మెప్మా పీడీ అన్నపూర్ణతో మాట్లాడారు. కందుకూరులో అంగన్‌వాడీ ప్రీస్కూళ్ల సంఖ్యను పెంచాలని సమన్వయకర్తను ఆదేశించారు. నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో పాఠ్యాంశ టీచర్ల కొరత లేకుండా డిప్యూటేషన్‌పై జడ్పీ పాఠశాలల నుంచి నియమించాలని డీఈవోను ఆదేశించారు. తమ పరిధిలో ఉన్న మిగులు టీచర్లను నియమిస్తామని డీఈవో మంత్రికి వివరించారు. నగరంలోని పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం మంత్రి కాకినాడకు బయలుదేరి వెల్లారు.




# విజయభాను

## సంపాదకీయం

### ఏం సాధించామని ఘనత

పెద్ద నోట్ల రద్దుపై ఎట్టకేలకు ఆర్బీఐ నోరు విప్పింది. నల్లధనంపై బ్రహ్మాస్త్రంగా మన పాలకు లు చేసిన ప్రచారహోరులో నిజమెంత అన్నది ఇప్పుడిప్పుడే గణాంకాల రూపంలో వెలుగులో కి వస్తున్నది. రద్దయిన పెద్దనోట్లలో 99శాతం ఖజానాకు చేరాయని ఆర్బీఐ తొమ్మిది నెలల తర్వాత బయటపెట్టింది. చలామణిలో ఉన్న నోట్ల విలువ 15.44 లక్షల కోట్లు అయితే, అందులో15.28లక్షల కోట్లు డిపాజిట్ అయ్యాయని తెలిపింది. 1000 రూపాయల నోట్లలో 1.4 శాతం మాత్రమే తిరిగి రాలేదని చెబుతూ, దాదాపు 99 శాతాన్ని తిరిగి రాబట్టామని ఘనతగా చెప్పుకున్నది. 500 నోట్ల సంగతి ఇంకా చెప్పలేదు. మరోవైపు దీన్నే పెద్ద ఎత్తున డబ్బు బ్యాంకుల్లో జమకావటం వల్ల రహస్యం అనేది తొలిగిపోయిందని, ఇది మన ఆర్థిక మంత్రి సాధించిన ఘనకార్యంగా చెప్పుకొచ్చారు. అయితే ఇన్నాళ్లు గడిచాక సాధించింది ఇదీ అని చెప్పుకోలేని స్థితిలో ఇప్పుడు ఆర్బీఐ, ప్రభుత్వాధినేతలు చెబుతున్న కబుర్లు ఎవరికైనా ఆగ్రహం తెప్పిస్తాయి. నిజానికి కరెన్సీ లెక్కపెట్టడానికి ఇంత సుదీర్ఘ సమయం తీసుకోనవసరం లేదు. ఆ డబ్బం తా ఒకేచోట, ఒకేరోజు జమయ్యిందేమీ కాదు. ప్రతి రోజూ ప్రతి బ్యాంకులోనూ లెక్కలు సరిచూసుకుంటూనే కరెన్సీ తీసుకుంటారు. ఒకటికి పదిసార్లు సరిచూసుకుంటారు. జమ అయిన వివరాలు ఎప్పటికప్పుడు చేరవేయాల్సిన చోటుకు చేరవేస్తారు. ఇలా అందజేసిన వివరాలన్నీ ఆర్బీఐకి చేరుతూనే ఉంటాయి. గడువు ముగిసిన వెంటనే ప్రభుత్వానికి వివరాలివ్వటం ఆర్బీఐకి కష్టమైన పనేమీ కాదు. ఎంత లెక్కలు వేసినా ఒకటి రెండు రోజులకు మించిన పని కాదు. ఈ మాత్రానికే ఇంత ఆలస్యం చేసి కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా జమ అయిన నోట్ల వివరాలివ్వటం హాస్యాస్పదం.

నిరుడు నవంబర్ 8న రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ పెద్ద నోట్ల రద్దు ప్రకటన చేస్తూ ఇక రేపటి నుంచి శుభోదయమే అన్నారు. నల్లకుబేరులు తెల్లమొఖాలేస్తారని, నల్లధనమంతా మాయమై సంపదంతా ప్రజలందరికీ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కరెన్సీ వ్యవస్థలో మూడు లక్షలకోట్ల మేర నల్లడ బ్బు ఉన్నదని, దాన్నంతా లెక్కలు చెప్పలేని వారం తా దాన్ని వదులుకుంటారని నమ్మబలికారు. దీం తో పెద్ద నోట్ల రద్దు పర్యవసానాలు అనుభవంలోకి రాని ప్రజలు తెల్లారి రోజువారీ జీవితం ఆరంభించటంతోనే వారి కష్టాలు మొదలయ్యాయి. చేతిలో ఉన్న పెద్ద నోట్లు చిత్తుకాగితాలై పోయాయి. దైనందిన అవసరాలు కూడా తీరని గడ్డు పరిస్థితి ఎదురైంది. ఇక పెండ్లీలు, ఇతర శుభకార్యాలు, నిర్మాణాల కోసం ఇంట్లో డబ్బు దాచుకున్న వారిదైతే అరణ్యరోదనైంది. దైనందిన అవసరాలు తీర్చుకోవటం కోసం కావాల్సిన కొత్తనోట్లకోసం బ్యాంకుల ముం దు రాత్రి, పగలు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉద్యోగాలు, పనులు మాని బ్యాంకుల ముందు లైన్లలో నిలబడిన వారికి కూడా విడుతల వారీగా బ్యాంకులు ఇచ్చే డబ్బు దేనికీ సరిపోక జనాలు పడిన యాతన అంతా ఇంతా కాదు. మూ తపడిన ఏటీఎంలు తెరుచుకోవటానికి, పరిమితంగానైనా అవసరాలు తీర్చుకోవటానికి డబ్బు చేతికి అందడం అనేది చాన్నాళ్లే పట్టింది. సుమారు 103 మంది బ్యాంకుల ముందు నోట్లకోసం లైన్ల లో నిలబడి ప్రాణాలు వదిలారంటే పెద్దనోట్ల రద్దు సృష్టించిన ఉపద్రవం తక్కువేమీ కాదు. ఇంత జరిగినా రిజర్వుబ్యాంకు తన వార్షిక నివేదికలో పెద్ద నోట్ల పర్యవసానానికి చివరిపేజీల్లో స్థానం కల్పించింది. ఇది ఏమాత్రం ప్రాధాన్యం లేని విషయంగా దాచిపెట్టే ప్రయత్నం చేయటమే విడ్డూరం. కొసమెరుపుగా దేశవ్యాప్తంగా ఉన్న నాలుగువేల ఖజానాల్లో జమ అయిన కరె న్సీ నోట్ల లెక్కలను సరిచూసుకున్న తర్వాత ఇప్పుడు చెబుతున్న గణాంకాలు మారొచ్చని చెప్ప టం హాస్యాస్పదం. అవినీతికీ, నల్లడబ్బుకూ ముకుతాడు వేయటానికి పెద్దనోట్ల రద్దు ఓ మహాయజ్ఞంగా ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాదానికి అడ్డుకట్ట అన్నారు. శ్రీమంతులకు, నిజాయితీపరులకు మధ్య సాగే మహాసంగ్రామం అన్నారు. కానీ జరిగిందేమిటన్నది కండ్లముందు కనిపిస్తూనే ఉన్నది. చలామణిలో నల్లడబ్బు దాదాపుగా లేదని తేలిపోయింది. తిరిగిరాని నోట్లు కేవలం 16వేల కోట్లే. ఇదే నల్లధనం విలువ జీడీపీలో 0.1శాతమే. కానీ నోట్ల రద్దుతో జీడీపీలో ఒకశాతం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. స్థూలంగా చూస్తే పెద్ద నోట్ల రద్దుతో పారిశ్రామిక ప్రగతి కుంటుపడింది. ఉపాధి కల్పన మందగించింది. వృద్ధిరేటు పడిపోయింది. అయితే కేవలం రాజకీయ కారణాలతోనే విమర్శలకు దిగి పెద్దనోట్ల రద్దు అనేదే పనికిమాలిన చర్యగా కొట్టిపారేయటం అనుచితమైనది. జవాబుదారీతనం, పారదర్శకత లేని ఆర్థిక కార్యకలాపాలే ప్రధాన స్రవంతిగా సాగే ఆర్థిక వ్యవస్థ ఎన్నటికీ, ఎవరికీ మంచి చేయదు. కాబట్టి అలాంటి చీకటి వ్యవహారాలను ఎప్పుడైనా అడ్డుకట్ట వేయాల్సిందే.

## శిశువులందరికీ నూరు శాతం టీకాలు వేయడమే లక్ష్యం

### ఇంద్రధనుస్సు మిషన్ ద్వారా చర్యలు

బ్రహ్మపుర : గంజాం జిల్లాలో, బీఎమ్సీ పరిధిలో గర్భిణులకు, రెండేళ్ల శిశువులకు ఇంద్రధనుస్సు మిషన్ ద్వారా టీకాలు వేయడమే లక్ష్యమని వైద్యాధికారులు అన్నారు. సిటీ హెల్త్ సొసైటీ (సీహెచ్ఎస్), నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ (ఎన్యూహెచ్ఎం)ల ఆధ్వర్యంలో శుక్రవారం బీఎమ్సీ మండలి సమావేశ మందిరంలో నగర స్థాయిలో ఇంద్రధనుస్సు మిషన్ ద్వారా టీకాలు వేసే ప్రక్రియ ఎలా అన్న దానిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సీడీఎంఓ వైద్యుడు సరోజ్‌కుమార్ మిశ్ర, ఏడీఎంఓ (ఎఫ్‌డబ్ల్యూ) వైద్యులు సుకాంతి మిశ్ర, వైద్యుడు జగదీష్ పట్నాయక్, సర్వైలెన్స్ నోడల్ అధికారి దేబిప్రసాద్ గోస్వామి, బీఎమ్సీ ఉప కమిషనర్ శౌరీంద్రకుమార్ రౌత్రాయ్, ఆరోగ్యాధికారి శితాసిస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత బీఎమ్సీ మేయర్ కె.మాధవి అతిథిగా సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీఎంఓ మిశ్ర, వైద్యుడు జగదీష్ పట్నాయక్‌లు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని గర్భిణులకు, శిశువులకు ఏడు టీకాలు వేసే ప్రక్రియ పక్కాగా జరగాలన్నారు. ఇందుకోసం గత నెల 20వ తేదీ నుంచి జిల్లా అంతటా సర్వే జరుగుతోందని చెప్పారు. వారం రోజుల్లోగా సర్వే పూర్తయిన తర్వాత జిల్లాలోని, పట్టణ ప్రాంతంలో, టీకాలు వేసే ప్రక్రియ మొదలవుతుందని వైద్యులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఈ ఇంద్రధనుస్సు మిషన్ ద్వారా జిల్లా, బ్రహ్మపుర నగరపాలక సంస్థలో 2018లోపు తొంభై శాతం టీకాలు వేయడమే తమ లక్ష్యమని వైద్యులు చెప్పారు. ఉప కమిషనర్ రౌత్రాయ్ మాట్లాడుతూ బీఎమ్సీ పరిధిలోని ఆరోగ్యసేవల్లో ఎలాంటి లోటు రాకుండా చూసుకోవాలని, అనుకున్న వేళల్లో శిశువులకు, గర్భిణులకు టీకాలు వేయాలని సూచించారు.

అనంతరం టీకాలు వేసే ప్రక్రియ తెరపై ప్రదర్శించి చూపారు. సమావేశంలో అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ (యూపీహెచ్‌సీ) మెడికల్ ఆఫీసర్లు, డాటా అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రాయగడ స్టేషన్లో వైఫై సౌకర్యం

రాయగడ : రాయగడ రైల్వేస్టేషన్లో ఇకపై ప్రయాణికులకు వైఫై సౌకర్యం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) ఉమేష్ సింగ్ అన్నారు. రాయగడ పర్యటనకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతానికి ప్రయోగాత్మకంగా ఇక్కడ వైఫై సౌకర్యాన్ని ప్రారంభిచామన్నారు. మరికొద్ది రోజుల్లో ఇది పూర్తిస్థాయిలో వినియోగంలోకి రానుందని సింగ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయనని కలిసి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేసిన వారితో వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పలు రాజ కీయ పార్టీలు, స్థానిక సంస్థలు, ప్రముఖులు సంయుక్తంగా అందజేసిన వినతిపత్రాన్ని సింగ్ స్వీకరించారు.

## కేన్సర్ నియంత్రణపై చైతన్య ర్యాలీ



బరగఢ్ : జిల్లాలో కేన్సర్ వ్యాధి నియం త్రణకు మార్వాడీ యువమంచ్ నడుం కట్టింది. దీనిలో భాగంగా శుక్రవారం వ్యాధిపై ప్రజల్లో అవ గాహన కల్పించేందుకు చైతన్య ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. పొగాకు వాడొద్దు, పాలిథీన్ నిషేధించాలని నానాదాలు చేశారు.

అనంతరం ఎరువులు వాడకుండా సాగుచేసే రైతులకు ప్రోత్సా హకాలు ఇవ్వాలని డిమాండు చేస్తూ కలెక్టర్ ఖగేంద్రనాథ్ పాడికి వినతిపత్రం అందించారు.

అంతకు ముందు ఎంపీ ప్రభాస్‌సింగ్ ర్యాలీ ప్రారంభించారు.

## ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

చెన్నై : కళలను పోషించే దిశగా చెన్నైలోని ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ ఉమ్మిడి హౌస్ గ్రూపునకు చెందిన వీబీసీ జ్యులరీ (జీఎన్ శెట్టి రోడ్) విభాగం శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. ఆభరణాల చరిత్ర, వాటి విశేషాలను నృత్య రూపంలో వివరిస్తూ ఈ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చెన్నై నగరంలోని ఆళ్వారుపేటలో ఉన్న శివగామి పేటాచ్చి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమాన్ని ఐఏఎస్ అధికారి కవితా రాము జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన మేనేజింగ్ పార్టనర్ ఉమ్మిడి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించే దిశగా వీబీసీ ఆభరణ్ పేరిట వారికి నృత్యం తదితర సాంస్కృతిక కళలపై ప్రముఖ నృత్య కళాకారుల వద్ద శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. సుమారు 90 మంది విద్యార్థులను ఎంపికచేసి నాలుగు వారాల శిక్షణ ఇచ్చారన్నారు.

సంస్థ నిర్వాహకులు లక్ష్మి స్నేహ ఉమ్మిడి, లక్ష్మీ శృతి ఉమ్మిడి, సుహాసిని బాలాజీ తది తరులు ఈ శిక్షణ ఇప్పించడంలో కృషి చేశారన్నారు.

## చదువుల కల్పవృక్షం వి.వి సంఘం

బళ్లారి : ఈ ప్రాంత విద్యార్థులు చదువుల కోసం అనంతపురం, మద్రాసుకు వెళ్లేవారు. మద్రాసు ప్రభుత్వ హయాంలో బళ్లారిలో వీరశైవ విద్యావర్థక సంఘాన్ని ప్రారంభించి పలు విద్యా సంస్థలు నెలకొల్పడం వల్ల హైదరాబాద్-కర్ణాటక ప్రాంతవాసులకు కల్పవృక్షంగా మారింది. లక్షలాది మంది విద్యార్థులకు విద్యాదానం చేసినట్లయిందని బళ్లారి రావ్‌బహద్దూర్ వై.మహబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ఆచార్య డా.ఎ.తిమ్మనగౌడ పేర్కొన్నారు. బళ్లారి వీరశైవ విద్యావర్థక సంఘం శతమానోత్సవ కార్యక్రమం శుక్రవారం అల్లం సుమంగళమ్మ స్మారక మహిళా మహవిద్యాలయంలో నిర్వహించారు. తిమ్మనగౌడ మాట్లాడుతూ మద్రాసు ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో విద్యావకాశాలు, ఇబ్బందులు, వి.వి. సంఘం ఏర్పాటు తదితర విషయాలను సుదీర్ఘంగా వివరించారు. అప్పట్లో విద్యా సంస్థలు లేక పలువురు ప్రతిభావంత విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారు. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. అలాంటి పరిస్థితుల్లో హనగల్ కుమారస్వామి 1909 డిసెంబరు 27 నుంచి 30 వరకు జరిగిన అఖిగల భారత మహాసభలో సొల్లాపురం మల్లప్ప అధ్యక్షతన బళ్లారి వీరశైవ విద్యావర్థక సంఘం ప్రారంభిస్తున్నట్లు ప్రకటిం చారు. జగద్గురు సంపూర్ణ సహకారంతో వీరశైవ సమాజం ప్రముఖులు కలిసి 1916లో వి.వి. సంఘం ప్రారంభించారని తిమ్మనగౌడ పేర్కొన్నారు. పేద విద్యార్థుల కోసం సక్కర కరెడప్ప చౌకులో విద్యార్థుల ప్రసాద నిలయం, వి.వి. సంఘం ఆధ్వర్యంలో 40కి పైగా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బళ్లారి గని యజమాని ఎస్.కె. మోది ఆర్థిక సాయంతో మోది ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభమైంది. అనంతరం జరిగిన చర్చాగోష్ఠిలో వి.వి. సంఘం చేస్తున్న సమాజసేవా కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమానికి శాంతనగౌడ, మహరుద్రగౌడ, కోళూరు చంద్రశేఖర్‌గౌడ, రాజశేఖర్‌గౌడ, నేపాక్షప్ప, డా.ప్రభయ్యస్వామి, తేజస్విని, సోమశేఖర్, చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

## కవి సమయం

### శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావది మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.

కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : భాద్రపద ; తిథి : ద్వాదశి ఉ.9.15;
ఉత్తరాషాడ ఉ.9.35; మ.వ.1.53ల 3.36

ఆదివారం
03-09-2017

**మేషం :** ప్రైవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులకు అనుకూలం. **వృషభం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు.ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం :**ఎల్ఐసి, పోస్టల్ ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు టార్గెట్‌లను అధిగమిస్తారు. ఉపాధ్యాయులకు, రిప్రజెంటేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం :** స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదాపడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కాం´మవుతాయి. అంతగా పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండటం మంచిది. **సింహం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. **కన్య :** ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవ దర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజ యాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బం దులు తలెత్తుతాయి. **తుల :** నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిల దొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం. **వృశ్చికం :** దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారి తీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. కొంతమంది మీ నుంచి ధనం లేక ఇతత్రా సహాయం ఆర్థిస్తారు. ముఖ్యుల రాకపోకలు అధికం అవుతాయి. **ధనుస్సు :** వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. కీలకమైన సమస్యలు పరిష్కారం కావటంతో మీలో కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. కుటుంబీకుల కోరికలు తీరుస్తారు. చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చల్లో మీ అభిప్రాయాలకు ఆమోదం లభిస్తుంది. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. **మకరం :** ఒక కార్యం నిమిత్తం ప్రయాణం చేస్తారు. పత్రికా సంస్థలలోని వారికి ఊహించని సమస్యలెదురవుతాయి. దంపతుల మధ్య చిన్న చిన్న కలహాలు, చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. డాక్టర్లు అరుదైన చికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు. సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. **కుంభం :** దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. మీ ఆంతరంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ప్రేమికుల అత్యుత్సాహం అనర్థాలకు దారితీస్తుంది. రావలసిన ధనం వసూలు కావటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. **మీనం :** విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అను కూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

## పరమ పవిత్రం... కేదారం

### సంకీర్తన



పరమేశ్వరుని సన్నిధానాల్లో పరమ పవిత్రమైనది కేదార్‌నాథ్ మహాక్షేత్రం. హిమగిరుల్లో నెలకొన్న ఈ క్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా యుగయుగాలుగా వేలాదిమంది భక్తుల పూజలు అందుకుంటోంది. రుద్రహిమాలయ పర్వత ప్రాంతాల్లోని ఈ క్షేత్రాన్ని దర్శించాలంటే భక్తులు చాలా శ్రమించాల్సి వుంటుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రప్రయాగ్ జిల్లాలోని పర్వతాల్లో పరమశివుడు కేదారేశ్వరుడిగా భక్తులకు దర్శనమిస్తారు. శీతాకాలంలో ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తారు. వేసవి కాలం ప్రారంభంలోనే ఆలయాన్ని తెరవడం సంప్రదాయంగా వస్తోంది. మందాకిని నది జన్మస్థానం కూడా కేదార్‌నాథ్ సమీప పర్వతాల్లోనే వుంది.

**స్వయంభువుగా శివుడు..**

పరమశివుడు ఇక్కడ స్వయంభువుగా భక్తులకు అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంటాడు. ద్వాపరయుగంలో కురుక్షేత్ర యుద్ధం అనంతరం పాండవులు విజేతలుగా నిలుస్తారు. అయితే యుద్ధంలో తమ సొంత దాయాదులను చంపవలసివచ్చినందుకు ఎంతగానో వేదనకు గురవుతారు. తమ పాపాల నుంచి విముక్తి పొందేందుకు మహేశ్వరుని దర్శనం కోసం హిమాలయాలకు చేరుకుంటారు. ఈశ్వరుడు వృషభరూపంలో కేదారం వద్ద వుండటాన్ని పాండవులు గమనిస్తారు. వారు వచ్చేలోగా శివుడు భూమిలోకి వెళ్లిపోతాడు. పాండవులకు మోపురం మాత్రమే దర్శనమిస్తుంది. ఆ దర్శనంతో పాండవులకు పాప విముక్తి కలుగుతుంది. భూమిలోకి వెళ్లిన పరమేశ్వరుని ముఖ భాగం నేపాల్‌లోని పశుపతినాథ ఆలయంలో వున్నట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. మధ్యమహేశ్వర్, తుంగ్‌నాథ్, రుద్రనాథ్, కల్పేశ్వర్, కేదార్‌నాథ్... ఈ ఐదింటిని పంచ కేదార్‌నాథ్ క్షేత్రాలుగా పేర్కొంటారు.

**ఆధ్యాత్మికశిఖరం..**

మంచుకొండల్లోని కేదార్‌నాథ్ క్షేత్రానికి చేరుకోవడం అత్యంత శ్రమతో కూడుకున్న పని. కానీ శివానుగ్రహం భక్తుల్ని ఆ ఇబ్బందులనుంచి దూరం చేస్తుంది. ఇక్కడ ఆలయాన్ని పాండవులు నిర్మించారని తెలుస్తోంది. అనంతరం ఆదిశంకరాచార్యులు ప్రాచీన ఆలయానికి సమీపంలోనే ప్రస్తుతం మనం చూసే ఆలయాన్ని నిర్మించారు. ఎన్నో వందల సంవత్సరాలు మంచుతో కప్పబడిన మహాపుణ్యక్షేత్రం అనంతరం దర్శనమివ్వడం భగవద్ అనుగ్రహమే. ఆదిశంకరులు ఇక్కడి నుంచే కైలాసానికి చేరుకున్నట్టు ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఆదిశంకరుల సమాధిని కూడా ఆలయ సమీపంలో దర్శించవచ్చు. మంచు కొండల నడుమ పెద్ద పెద్ద రాళ్లతో ఆలయాన్ని నిర్మించడం దైవానుగ్రహమని పెద్దలు చెబుతారు. ఆలయం ముందు భాగంలో కుంతీదేవి, పాండవులు, శ్రీకృష్ణ విగ్రహాలు వుంటాయి. ఆలయం ముందు నంది విగ్రహం వుంటుంది. ఆలయంలో పరమశివుడు సదాశివమూర్తిగా దర్శనమిస్తారు.



**కొండలనెక్కి... శ్రమను అధిగమించి..**

ఉత్తరాఖండ్‌లోని పవిత్రపుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్, యమునోత్రి, గంగోత్రిలను దర్శించుకోవడాన్ని మినీ చార్‌ధామ్ యాత్రగా పేర్కొంటారు. కేదార్‌నాథ్ ప్రయాణం క్లిష్టంగా వుంటుంది. రిషికేశ్ నుంచి గౌరీకుండ్ వరకు సులభంగా చేరుకోవచ్చు. గౌరీకుండ్ నుంచి గుర్రాలు, డోలీలు లేదా కాలినడక ద్వారా ప్రయాణించాల్సి వుంటుంది. హిమపాతంతో కూడిన ప్రతికూల వాతావరణంలో భక్తులు ప్రయాణించాలి. హెలికాప్టర్ల సర్వీసులను ఉత్తరాఖండ్ ప్రభుత్వం కల్పించింది. కానీ ఈ ప్రయాణానికి ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయి. సముద్రమట్టానికి దాదాపు 3500 మీటర్ల ఎత్తులో వుండే కేదార్‌నాథ్‌ను చేరుకోవడంతో బడలిక మొత్తం ఎగిరిపోతుంది. ఆ నీలకంఠుని దర్శనంతో ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# రాష్ట్రపతికి ప్రభుత్వ విందు హాజరైన ప్రముఖులు

తిరుపతి : రెండు రోజులు పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విందు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు పలువురు రాజకీయ నేతలు, పారిశ్రామికవేత్తలు, సామాజికవేత్తలు, విద్యావేత్తలు హాజరయ్యారు. రాత్రి 7.35 గంటల సమయంలో శిల్పారామం లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ విందుకు రాష్ట్రపతి సతీసమేతంగా విచ్చేశారు. రాష్ట్రపతి దంపతులకు గవర్నర్‌తోపాటు సీఎం సాదర స్వాగతం పలికారు. సుమారు 200 మంది వరకు హాజరయ్యారు. విందు సందర్భంగా రాష్ట్రపతితో ముఖ్యమంత్రి కొద్దిసేపు ప్రత్యేకంగా ముచ్చటించారు. అనంత రం 8.30 గంటలకు రాష్ట్రపతి దంపతులు రోడ్డు మార్గం ద్వారా తిరుమలకు బయల్దేరి వెళ్లారు. విందులో రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, అచ్చెన్నాయుడు, నారా లోకేష్, దేవినేని ఉమా, మాణిక్యాలరావు, అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, మురళీమోహన్, శివప్రసాద్, వరప్రసాద్, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, ఎమ్మెల్యేలు సుగుణమ్మ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సత్యప్రభ, శంకర్, తలారి ఆదిత్య, నారాయణస్వామి, జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణి, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు, చిత్తూరు మేయర్ కఠారి హేమలత, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, చిత్తూరు ఎస్పీ రాజశేఖర్‌బాబు, సంయుక్త కలెక్టర్ గిరీషా, తిరుపతి సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమార్, మదనపల్లె సబ్‌కలెక్టర్ వెట్రి సెల్వి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొందరు పాస్‌లు లేకుండా వచ్చేందుకు ప్రయత్నించగా భద్రత సిబ్బంది వారిని అడ్డుకున్నారు.

# విద్యార్థులకు పవన్‌కళ్యాణ్ భరోసా



తిరుపతి : రాష్ట్రంలోని వ్యవసాయ విద్యార్థులకు అండగా ఉంటానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులకు భరోసా కల్పించారు.

వ్యవసాయ విద్యార్థులు గత నెల రోజులుగా తరగతులను బహిష్కరించి ఆందోళనలు చేస్తున్న విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడి ఆందోళనకు కారణమైన జీవో నెంబరు 64ను రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. హాజరుశాతం 25కు తగ్గితే ప్రవేశాలు రద్దు చేస్తామంటూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రు లకు రెండు రోజులుగా వ్యవసాయ విశ్వవిద్యాల య అధికారులు రాష్ట్రవ్యాప్తంగా సమాచారం ఇచ్చారు. రెండు రోజుల్లో ఆందోళన విరమించక పోతే నిబంధనల ప్రకారం ప్రవేశాలు రద్దయ్యే అవకాశం ఉందని అధికారులు పంపిన సందేశాన్ని విద్యార్థులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లడంతో వ్యవసాయ విద్యార్థుల ఉద్యమానికి తన మద్దతు ఉంటుందని సంక్షిప్త సందేశం ద్వారా హామీ ఇచ్చారు. అనంతరం జనసేన జిల్లా నాయకులు పసుపులేటి హరిప్రసాద్ వ్యవసాయ కళాశాల విద్యార్థులను కలిసి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెట్టి ఉపకార వేతనాలు రావని హెచ్చరించడం, ప్రవేశాలు రద్దు చేస్తామని చెప్పడంపై పవన్ కళ్యాణ్‌కు వివరించి సమస్యను రెండు మూడు రోజుల్లో పరిష్కరిం చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ర్యాగింగుకు పాల్పడితే శిక్షార్హులు

ప్రొద్దుటూరు : సీనియర్ విద్యార్థులు జూనియర్లతో స్నేహ పూర్వకంగా మెలగాలని రెండో అదనపు జిల్లా జడ్జి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. లింగాపురం సమీపంలోని సాయిరాజేశ్వరి ఇన్స్టూట్ ఆఫ్ ఇంజినీరింగు కళాశాల (ఎస్ఆర్ఐటీ)లో ర్యాగింగు నియంత్రణ.. చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# 280 కిలోల గంజాయి పట్టివేత
## రెండు కార్లు స్వాధీనం, ఆరుగురి అరెస్టు



మారేడుమిల్లి : ఏజెన్సీలోని లోతట్టు ప్రాంతం నుంచి మారేడుమిల్లి మీదుగా అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని మారేడుమిల్లి పోలీసులు పట్టుకున్నారు. మారేడుమిల్లి శివారులోని మద్దులూరు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా గంజాయి అక్రమ రవాణా బయట పడింది. దీనికి సంబంధించి రంపచోడవరం ఏఎస్పీ అడ్నాన్ నయింఅస్మీ మారేడుమిల్లి పోలీస్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని పాతకోట నుంచి గంజాయి అక్రమంగా రవాణా అవుతుందనే సమాచారం అందడంతో మారేడు మిల్లి సీఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా మద్దు లూరు వద్ద వాహన తనిఖీలను చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన రెండు కార్లను తనిఖీ చేయగా, వాటిలో 280 కిలోల గంజాయి బయటపడింది. రెండు కార్లలో సుమారు ఎనిమిది బస్తాల్లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

దీనికి సంబంధించి తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం ఎరకపల్లికి చెందిన రాథోడ్ సురేశ్, జాదవ్ ప్రేమ్‌సింగ్, ఇరకపల్లి తాండాకు చెందిన జాదవ్ మారుతి, వట్టిపల్లికి చెందిన మెగావత్ రమేష్, చేవెళ్లకు చెందిన తెనుగు పాండు, బోరంచకు చెందిన సింథోల్ సంగారెడ్డిలను అరెస్టు చేసి రెండు కార్లను సీజ్ చేశారు. మారేడుమిల్లి సీఐ వై.రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై సత్యల తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యక్రమంలో సీఐ రవికుమార్, మారేడుమిల్లి, గుర్తేడు ఎస్సైలు తులసీరామ్, ఎస్.నాగేశ్వరరావు, ఏఎస్సై జి.బాబూరావు, కానిస్టేబుళ్లు గోవిందు, నాయు డు, గోపి, అరుణ్, సురేశ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలే సీఎం లక్ష్యం
## పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు



సఖినేటిపల్లి : రాష్ట్రంలో అన్నీ ఆదర్శ గ్రామాలు కావాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడి ఆశయమని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ బిభ.రామాంజనేయులు అన్నారు. సఖినేటిపల్లి మండలం మోరిపోడు రివర్‌సైడ్ పాఠశాల ఆవరణలో బర్కిలీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఏడాది మోరి, మోరిపోడులను ఆదర్శ గ్రామాలుగా సీఎం ప్రకటించడంతో ఎన్నో సౌకర్యాలు స్థానికులకు సమకూరాయన్నారు. ఫైబర్‌గ్రిడ్ సేవలు అందుబాటులోకి రావడంతో ఇక్కడి చేనేత వస్త్రాలు, జీడిపప్పు, మట్టికుండలకు ఆన్‌లైను మార్కెట్ ద్వారా మంచి ధర లభిస్తోందని చెప్పారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా గ్రామాలు వేగంగా అభివృద్ధి సాధిస్తాయన్నారు. సీఎం చెప్పిన విధంగా మనిషికి నెలకు రూ.10 వేలు లభించే అవకాశం ఈ ప్రాంత ప్రజలకు త్వరలో రానుందని పేర్కొన్నారు. జిల్లాలో రాజోలు, పశ్చిమలో ఉండి, చిత్తూరులో కుప్పం, కృష్ణాలో కైకలూరు, శ్రీకాకుళం జిల్లాలో నర్సన్నపేట నియోజకవర్గాల్లో 424 గ్రామాలను త్వరలో ఆదర్శ గ్రామాలుగా ప్రకటించనున్నట్లు వివరించారు. వీటికి సంబంధించిన కసరత్తు జరుగుతోందన్నారు. ప్రజలు కూడా సహకరించినపుడే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవు తయన్నారు. అనంతరం రివర్‌సైడ్ పాఠశాల విద్యార్థులు దివ్య, సాయి రూపొందించిన శాటిలైట్ నమూనాను నాసా డైరెక్టరు జోషఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన ఎనీలా తెలుగులో జాతీయ గీతాన్ని శ్రావ్యంగా ఆలపించి అందరినీ ఆకట్టుకుంది. అమెరికాలోని భారత రాయబారి అశోక్ వెంకటేష్, కేఎల్ యూనివర్సిటీ అధినేత సత్యనారాయణ, స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషను ఛైర్మన్ గంటా సుబ్బారావు, అమలాపురం ఆర్డీవో గణేష్‌కుమార్, వివిధ సంస్థల సీఈవోలు, ఎంపీపీ పనప్పుల లక్ష్మీసరస్వతి, మోరి ,మోరిపోడు సర్పంచులు కొల్లాబత్తుల ఝాన్సీలక్ష్మీభాయి, చింతా వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ పార్కుకు స్థల పరిశీలన

బొమ్మూరు : రాజమహేంద్రవరం గ్రామీణ మండలంలో సైన్స్ పార్కు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెన్సీ కమిషనర్ ప్రవీణప్రకాష్ తదితరులు స్థల పరిశీలన చేశారు. బొమ్మూరులోని మహిళాప్రాంగణాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ సైన్స్ పార్కు విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందిం చేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వారు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. వారివెంట ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ విజయ్‌రామరాజు, శిక్షణ కలెక్టర్ ఆనంద్, రూరల్ మండల తహసీల్దార్, కె.పోసియ్య, ఎంపీడీవో రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

# ఏపీఎస్పీడీసీఎల్‌ను లాభాల బాటలో నడిపిస్తా
## నూతన సీఎండీ ఎంఎం నాయక్

తిరుపతి : ఏపీఎస్పీడీసీఎల్‌ను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని ఆ సంస్థ నూతన సీఎండీ ఎంఎం నాయక్ అన్నారు. తిరుపతిలోని డిస్కం ప్రధాన కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందేలా చూస్తానని చెప్పారు. సిటిజన్ ఛార్టన్ను సక్రమంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆటంకం లేకుండా 24 గంటల పాటు విద్యుత్తు సరఫరా చేయడమే లక్ష్యమని చెప్పారు. డిస్కం పరిధిలో విద్యుత్తు సరఫరా బాగున్నట్లు వెల్లడించారు. విద్యుత్తు శాఖలో ఐటీ విభాగం పనితీరు బాగుందని, దీన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆయన్ను డిస్కం సీఎండీ పుల్లారెడ్డి, జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.

# నదులను రక్షించాలని ర్యాలీ



రాజమహేంద్రవరం : నదీ జలాలను పరిరక్షించాలంటూ సద్గురు జగ్గీవాసుదేవ్ పిలుపు మేరకు ఇంటర్నేషనల్ ఏపీపీఎం లిమిటెడ్, నగరంలోని పలు పరిశ్రమల ఆధ్వర్యంలో నదీ అభియాన్ ర్యాలీని రాజమహేంద్ర వరంలో నిర్వహించారు. స్థానిక ఇస్కాన్ ఆలయం వద్ద నుంచి పుష్కరఘాట్ వరకూ ఈ ర్యాలీ సాగింది. పరిశ్రమల శాఖ జిల్లా ఉప ముఖ్య తనిఖీ అధికారి ఎం.శివకుమార్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, పేపరుమిల్లు ప్రతినిధులు సూరారెడ్డి, వేమూరి మధుశ్రీ, నటరాజన్ షణ్ముగం, ఈహెచ్ఎస్ జీఎం శ్రీనివాస కటాడి, ధవళేశ్వరం జీఎస్‌కే జీఎం మల్లాది శ్రీనివాసు, ఓఎన్జీసీ అసెట్ మేనేజరు పి.కె.పాండే, హెచ్‌పీసీఎల్ మేనేజరు ఎస్.కె.శర్మ, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నదుల వెంబడే నాగరికత, సంస్కృతులు అభివృద్ధి చెందాయని అటువంటి జీవనాధారమైన నదులు నేడు ప్రమాద పరిస్థితు ల్లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా మేల్కొని నదుల పరిరక్షణకు నదీతీరాలు వెంబడి కిలో మీటరు వరకూ వృక్ష జాతులను పెంచే విధంగా ప్రభుత్వాలు, ప్రజలు నడుంబిగిం చాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీ అనంతరం పుష్కర ఘాట్ వద్ద నీటి బిందువు రూపంలో ప్రదర్శన చేసి నదులను రక్షించాలని నినాదాలు చేశారు.

# అత్యున్నత ప్రమాణాలతో విద్యనందించడమే లక్ష్యం

బాపట్ల : కేజీ నుంచి పీజీ వరకు అత్యున్నత ప్రమాణాలతో విద్యార్థులకు విద్య అందించి వారు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ పనిచేస్తోందని సంస్థ అధ్యక్షుడు ముప్పలనేని శేషగిరిరావు పేర్కొన్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ నూతన పాలకవర్గ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని శు క్రవారం ఘనంగా నిర్వహించారు.

సొసైటీ అధ్యక్షునిగా ముప్పలనేని, కార్యదర్శిగా మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పాలడుగు పాపారావు, బూర్లె శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శి, కరస్పాండెంటుగా పంగులూరి భావనారాయణ చౌదరి, కోశాధికారిగా చంద్ర వెంకయ్య బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కార్యదర్శి మానం మాట్లాడుతూ గత పాలకవర్గం ఎడ్యుకేషన్ సొసైటీ అభివృద్ధికి చేసిన కృషిని అభినందించారు. ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా మంచి సేవలు అందించటానికి కలిసికట్టుగా అంకితభావంతో కృషి చేస్తామన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఎస్‌బీఐ పాత భవనాన్ని సొసైటీ తాత్కాలిక కార్యాలయంగా వినియోగించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

# పతకాలు సాధించి పల్నాడుకు పేరు తీసుకురావాలి




గుంటూరు : అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించి పల్నాడుకు పేరు, ప్రఖ్యా తులు తీసుకురావాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మాచవరం నకు చెందిన డిగ్రీ విద్యార్థిని గుగ్గిళ్ళ శ్రావణి చైనాలో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అక్కడకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో పాటు ఆంధ్రప్రదేశ్ డవలపర్స్ అసోసియేషన్ (అప్రెడా) నాయకులు ఆమెకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. యరపతినేని రూ.25 వేలు, అప్రెడా నాయకులు రూ.2 లక్షలు మొత్తం కలిపి రూ.2.25 లక్షలు చెక్కును క్రీడాకారిణి శ్రావణికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతి నేని మాట్లాడుతూ పల్నాడు ప్రాంతానికి చెందిన శ్రావణి హాంకాంగ్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఆమె తండ్రి ఆటోడ్రైవర్ అని, పోటీలకు వెళ్లేందుకు రూ.3 లక్షల కు పైగా ఖర్చు అవుతుందన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదన్న ఉద్దేశంతో తాము ఆదుకోవడానికి ముందుకు వచ్చామన్నారు. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు హాంకాంగ్‌లో జరిగే పోటీల్లో శ్రావణి ప్రతిభ కనపరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అప్రెడా రాష్ట్ర నాయకులు గద్దె తిరుపతిరావు, వేములపల్లి వెంకటనరసయ్య, జిల్లా నాయకులు చుక్కపల్లి రమేష్, యాగంటి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# 13 ఏళ్లుగా గోదాములో అధునాతన ట్రాక్టర్లు, ఆధునిక పరికరాలు
## పట్టించుకోని పాలకులు... చోద్యం చూస్తున్న అధికారులు



రామకుప్పం : కుప్పం రైతన్నలకు తొలిసారిగా ఆధునిక వ్యవసాయాన్ని పరిచయం చేసిన ఇజ్రాయెల్ సేద్యం యంత్రాలు మూలనపడి తుప్పు పడుతున్నాయి. 13 ఏళ్ల కిందట రూ. కోట్లు వెచ్చించి.. ఆధునిక వ్యవసాయం డెమో ప్రాజెక్టు అమలుకు వినియోగించిన అధునాతన వాహనాలు, యంత్రాలు గోదాములో మగ్గిపోతున్నాయి. కొంత సామగ్రి ఆరుబయట ఎండకు ఎండి.. వానకు తడుస్తూ శిథిలమవుతున్నాయి. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రత్యేక చొరవతో కుప్పంలో ఆధునిక వ్యవసాయం ప్రయోగాత్మక ప్రాజెక్టును అమలు చేశారు. ప్రస్తుతం తెదేపా మళ్లీ అధికారం చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా.. గోదాముల్లో మగ్గుతున్న యంత్రాలకు మోక్షం లభించని దుస్థితి నెలకొంది. ప్రభుత్వ సొమ్మేగా.. తుప్పుపట్టి పోతే పోనీ.. మనకేంటి అనుకున్నారేమో అధికారులు తెలీదు కానీ వీటిని వినియోగంలోకి తెచ్చే దిశగా ఎవరూ యోచించడం లేదు. ఏటా వర్షాభావంతో సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న కుప్పం రైతులను ఆదుకోవాలన్న ప్రభుత్వ ఆశయం మేరకు 1999లో ఇజ్రాయెల్ వ్యవసాయాన్ని పరిచయం చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ దేశానికి చెందిన వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలను సంప్రదించి.. ఇక్కడ నాలుగు మండలాల్లో ఆధునిక వ్యవసాయం విధానాన్ని ప్రారంభించారు. ఇందుకు సంబంధించి రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె వద్ద 200 ఎకరాల్లో ప్రదర్శన క్షేత్రాన్ని (డెమో ప్రాజెక్టు) ఏర్పాటు చేశారు. దాదాపు అయిదేళ్లపాటు ఈ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గ రైతులకు ఆధునిక సేద్యం, తక్కువ నీరు, పెట్టుబడితో అధిక దిగుబడినిచ్చే పంటల సాగుపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణాభివృద్ధి నిధులతో అధునాతన యంత్రాలు, వాహనాలు, వ్యవసాయ సామగ్రిని సమకూర్చారు. ఇజ్రాయెల్ వ్యవసాయంపై అవగాహన పెంచుకున్న రైతులు ఆధునిక సేద్యానికి అలవాటుపడ్డారు. అయితే డెమో ప్రాజెక్టుకు వినియోగించిన సామగ్రి మాత్రం మూలనపడిపోయింది. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ డెమో ప్రాజెక్టును రద్దు చేశారు. ఆధునిక సేద్యం అమలు, అధునాతన సామగ్రి కొనుగోలులో అక్రమాలు జరిగాయంటూ జస్టిస్ చలపతి కమిషన్ ఆధ్వర్యంలో విచారణ చేశారు. ప్రాజెక్టుకు వినియోగించిన యంత్రాలు, అధునాతన ట్రాక్టర్లు, ఇతర సామగ్రిని రామకుప్పం మండల పరిధి రాజుపేట గ్రామ సమీపంలోని గోదాములో భద్రపరిచారు. కొన్నింటిని గోదాము వద్ద ఆరుబయట పడేశారు. గడచిన 13 ఏళ్లుగా ఈ సామగ్రి తుప్పు పట్టి పోతోంది. ఆరుబయట ఉంచిన యంత్రాల్లో కొన్ని చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ సామగ్రిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని నియోజకవర్గ అన్నదాతలు కోరుతున్నారు.

# వర్షాకాలంలో సౌందర్య రక్షణ



వర్షాకాలం వచ్చేసింది. చిటపట చినుకుల్లో సరదాగా ఎంజాయ్ చేయాలని చాలామందికి ఉంటుంది. అలాగే హాట్ సమ్మర్ నుంచి చల్లటి అనుభూతిని ఆస్వాదించడానికి అందరూ ఇష్టపడతారు. అయితే.. చర్మ సమస్యలు కూడా వర్షాకాలంలో చాలా ఎక్కువగా ఎదురవుతాయి. కాబట్టి.. చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. వర్షాకాలంలో చర్మం ఎక్కువగా పొడిబారడం, యాక్నె, పింపుల్స్, ఇతర చర్మ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశాలుంటాయి.

గాలిలో ఉండే దుమ్ము, ధూళి చర్మానికి హానిచేస్తాయి. కాబట్టి సరైన జాగ్రత్తలు తీసుకుంటే.. వర్షాకాలాన్ని మీరు అనుకున్న విధంగా ఎంజాయ్ చేస్తూనే.. అందంగా మెరిసిపోవచ్చు. స్మార్ట్ లుక్ కోసం..

**అమ్మాయిలు వేసుకోవాల్సిన ఫేస్ ప్యాక్స్ :**

వర్షాకాలంలో చర్మాన్ని ఎలా సంరక్షించుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాన్ని ఇప్పుడు మీరు తెలుసుకోబోతున్నారు. ఈ చిట్కాలు కేవలం చర్మాన్ని సంరక్షించడమే కాకుండా.. చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. కాస్మొటిక్స్ అవసరం లేకుండానే వర్షాకాలంలో మీరు మెరిసిపోవచ్చు.

**వర్షాకాలంలో చర్మం నిర్జీవంగా మారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

వీలైతే రెండుసార్లు ఫేస్ వాష్ చేసుకోవడం వలన వర్షాకాలంలో చర్మం దుమ్ము, క్రిములు, కాలుష్యానికి ఎక్కువగా ఎక్స్ పోజ్ అవ్వాల్సి వస్తుంది. ఇది చర్మానికి చాలా హానికరం. కాబట్టి.. ముఖాన్ని ఖచ్చితంగా.. రెండు సార్లు శుభ్రం చేసుకోవడం వల్ల దుమ్ము తొలగిపోతుంది.

**టోనర్ :**

ఆల్కహాల్ ఫ్రీ టోనర్ ఉపయోగించడం వర్షాకాలంలో చాలా అవసరం. ముఖ్యంగా డ్రై స్కిన్ ఉన్నవాళ్లు.. ఇంకా డ్రైకాకుండా ఉండాలంటే.. టోనర్ కంపల్సరీ వాడాలి. ఒకవేళ ఆయిలీ స్కిన్ ఉంటే.. ఆస్ట్రిజెంట్ ఉపయోగించడం మంచిది.

**వాటర్ ప్రూఫ్:**

మేకప్ వర్షాకాలంలో ఎక్కువ మేకప్ వేసుకుంటే.. ఏమీ బాగోదు. కానీ.. వాటర్ ప్రూఫ్ మేకప్ వాడితే.. ఎలాంటి నష్టం ఉండదు. అవి అయితే చెదిరిపోకుండా ఉంటాయి.

**మాయిశ్చరైజర్:**

చర్మాన్ని రోజంతా మాయిశ్చరైజింగ్ గా ఉంచడం చాలా అవసరం. అయితే మాయిశ్చరైజర్ ని రెగ్యులర్ గా అప్లై చేస్తూ ఉంటే.. చర్మం పొడిబారకుండా ఉండటానికి సహాయపడుతుంది.

వారానికి ఒకసారి ఎక్స్ఫోలియేట్ డెడ్ స్కిన్ సెల్స్ నివారించడానికి.. చర్మాన్ని ఎక్స్ ఫోలియేట్ చేయడం చాలా అవసరం. అయితే వారానికి ఒకసారి కంపల్సరీ హోంమేడ్ స్క్రబ్ ఉపయోగించి.. డెడ్ స్కిన్ సెల్స్ తొలగించుకోవడం వల్ల.. చర్మం నిగారిస్తుంది.

సన్ స్క్రీన్ వాతావరణం చల్లగా, డార్క్‌గా ఉన్నప్పుడు చాలామంది సన్ స్క్రీన్ లోషన్ వాడకుండా ఉంటారు. ఇది చాలా పొరపాటు. ఎందుకంటే.. కొన్ని సెకన్ల పాటు సూర్య కిరణాలు పడినా.. చర్మానికి చాలా హానికరం. కాబట్టి బయటకు వెళ్లేటప్పుడు ఖచ్చితంగా.. కొంచెం సన్ స్క్రీన్ లోషన్ అప్లై చేయాలి.

ఎక్కువగా నీళ్లు తాగాలి: ఎక్కువ నీళ్లు తాగడం వర్షాకాలంలో చాలామంది వాతావరణం చల్లగా ఉండటం వల్ల నీళ్లు సరిగా తాగరు. కానీ.. వర్షాకాలంలో.. అయినా సరే నీళ్లు ఎక్కువ గా తాగడం వల్ల... హైడ్రేటెడ్‌గా ఉంటారు. దీనివల్ల చర్మం ఫ్రెష్ గా, అందంగా కనిపిస్తుంది.

## ‘షుగర్’ గాయాలు మానాలంటే...?

న్యూయార్క్: మనకేదైనా గాయమైతే కొంచెం ఇబ్బంది. అదే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఏదైనా గాయమైతే ఇక చెప్పనక్కర్లేదు ఆ అవస్థ! గోరు చుట్టుపై రోకటి పోటులా మానేవరకు మహా ఇబ్బంది పెట్టేస్తుంది. దీనిపై పరిశోధన జరిపిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా డేవిస్ శాస్త్రవేత్త డాక్టర్ మిన్ ఝూవ్ మాత్రం గాయం చుట్టూ స్వల్ప మోతాదులో కరెంటు షాక్‌లివ్వడం ద్వారా నయం చేస ుకోవచ్చని సూచిస్తున్నారు. మామూలు మనుషులకు గాయ మైనప్పుడు ఆ పరిసరాల్లోని కణాల ద్వారా అందే ఎలక్ట్రిక్ సంకేతాల కారణంగా గాయం మానే ప్రక్రియ మొదలవుతుంది. అదే మధుమేహ వ్యాధిగ్రస్తుల విషయంలో ఈ సంకేతాలు చాలా బలహీనంగా ఉన్నాయని మిన్ ఝూవ్ గ్రహించారు.

గాయం మానడానికి కృత్రిమంగా కరెంటు సంకేతాల శక్తిని పెంచితే త్వరగా నయమవుతుందని అంటున్నారు. గాయమైన చోట అయాన్లు వ్యాపించేలా మందులిస్తే ఈ కరెంటు సంకేతాలు ఎక్కువవుతాయని, లేదంటే నేరుగా కరెంటు షాక్‌లివ్వవచ్చని వివరించారు.



# కేశాలకు కావాలి రక్షణ




జాలువారే అందమైన, దట్టమైన జుట్టు చూసేవారిని వెంటనే ఆకర్షిస్తుంది. వారి అందాన్ని పెంచి, వారిని సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా మార్చేస్తుంది. వెన్నల కాంతులు విరబూసే కురులు మరింత నిగనిగలాడాలంటే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి మెరుసే కురుల కాంతుల కోసం అందంగా ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో చూద్దాం.....

వారంలో రెండు సార్లు తలకు నూనె రాసి, తల మాడు మీద బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల కురులు బాగా పెరగడానికి సహాయ పడుతుంది. జుట్టు సాధారణంగా ఉన్నట్లైతే మైల్డ్ షాంపూ, లైట్ కండీషనర్ ఉపయోగించండి. అయినప్పటికీ కురులకు హాని జరుగుతుంటే గోరువెచ్చని నూనెతో మసాజ్ చేయవచ్చు.

**షాంపూని పూర్తిగా ఉపయోగించాలి:**

హై ఆల్కహాల్ ప్రోడక్ట్స్, బ్లో డ్రయింగ్‌లకు దూరంగా ఉండాలి. తలకు షాంపూచేసిన తర్వాత షాంపూను నీళ్లతో పూర్తిగా తొలగించాలి. కండీషనింగ్ సమయంలో వెంట్రుకల మూలాల్లో లైట్ కండీషనర్ ను ఉపయోగించాలి. అదేవిధంగా తీసుకొనే ఆహారంలో కొవ్వు పదార్థాలు, నెయ్యి, నూనె పదార్థాలను వీలైనంత వరకూ తగ్గించండి. బాగా నీళ్ళు తాగి ఒత్తిడికి దూరంగా ఉండాలి.

**జెంటర్ హెయిరింగ్ సర్ఫింగ్ మాస్క్:**

జుట్టు సన్నగా పల్చగా ఉంటే జెంటర్ హెయిరింగ్ నర్ఫింగ్ మాస్క్ ఉపయోగించండి. ఇది వెంట్రుకలను దట్టంగా ఉండేలా చేస్తుంది. తగినంత తేమను అందిస్తుంది. వనమూలికలు (హెర్బల్స్)ను ఉపయోగించి తయారు చేసిన షాంపూ, గోరింటాకు ఆధారిత కండీషనర్‌లను కూడా వాడవచ్చు. అప్పుడు కురులు దట్టంగా కనిపిస్తాయి. నిగనిగలా డుతాయి.

**జుట్టుకు సహజరంగునే వాడండి:**

రంగు వేసుకొనే జుట్టుకు ప్రత్యేక శ్రద్ధ చాలా అవసరం. వారంలో లేదా 15 రోజులకు ఒకసారి వేడి నీళ్లతో మసాజ్ చేసి నరిషింగ్ ప్యాక్ వేసుకుంటే ఎంతో లాభదాయకంగా ఉంటుంది. దాంతో వెంట్రుకలకు పోషణ లభిస్తుంది. వెంట్రుకలు కూడా జిడ్డుగా మారవు. కురులకు కలర్ చేస్తే యు నీ ఫిల్టర్ ఉన్న కేర్ షాంపూను ఉపయోగించడం మంచిది. ఇది కురులకు కండిషనింగ్ ఇస్తుంది. ఇది ఎండ నుంచి రక్షించడం మాత్రమే కాదు, కేశాలకు కలర్ నిలిచి ఉండేలా చేస్తుంది.


**ఎక్కువ వేడి నీరు వద్దు:**

కురులను శుభ్ర పరచడానికి సాధారణ నీళ్ళతో ఉపయోగించాలి. ఎక్కువ వేడి వున్న నీళ్ళతో కురులను శుభ్ర పరిస్తే జుట్టులో ఉన్న నేచురల్ ఆయిల్ వెళ్లిపోతుంది. దాంతో కురులు పొడిగా, పెళుసుగా మారతాయి. అందుకే సాధారణ నీళ్ళను ఉపయోగిస్తే బాగుంటుంది. చల్లని నీళ్లు కూడా వెంట్రుకులపై దుష్ప్రభావం చూపిస్తాయి. కాబట్టి చలికాలంలో గోరువెచ్చిన నీళ్లు, వేసవిలో సాధారణ నీళ్లను ఉపయోగించాలి.

**ట్రిమ్మింగ్ ముఖ్యం:**

కురులను పొడవుగా చేయడానికి ముందు చిట్లిపోయిన వెంట్రుకులను ట్రిమ్మింగ్ చేయించాలి. ఇలా చేయకపోతే, చిట్లిన కురులు ఇతర కురులను కూడా బలహీనపరుస్తాయి. ఎనిమిది లేదా పది వారాలకు ఒకసారి జుట్టును ట్రిమ్మింగ్ చేయడం మంచిది. జుట్టుకు మెత్తగా లేదా గట్టిగా మార్చే స్టయిలిష్ జెల్‌ని కేవలం ప్రత్యేక సందర్భాల్లోనే ఉపయోగిస్తే మంచిది.

వేళ్ల కణుపుతో స్కాల్ప్ మసాజ్ చేయొచ్చు. షాంపూను అప్లై చేస్తున్నప్పుడు కూడా ఇలా చేయవచ్చు. వారంలో 2-3సార్లు హెయిర్ బ్రష్‌తో శుభ్రం చేయండి. దుమ్ము లేదా నూనె వెంట్రుకల్లో చేరకుండా చూడండి.



**నేచురల్ మాయిశ్చరైజర్:**

నేచురల్ హెయిర్ టానిక్ వాడితే వెంట్రుకలకు నేచురల్ మాయిశ్చరైజర్ లభిస్తుంది. వారంలో రెండు సార్లు ఆలివ్ ఆయిల్, బాదం, ఆముదం, నూనెను సమానంగా కలిపి సాయంత్రం ఈ నూనెతో చర్మంపై మసాజ్ చేసి మర్నాడ్ హెర్బల్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకుల మూలాలు దృఢంగా మారుతాయి. చాలామంది చర్మానికి, ముఖానికి ఇచ్చే ప్రాముఖ్యతను జుట్టు అందానికి ఇవ్వరు. కొందరు తరచుగా షాంపూలను మారుస్తుంటారు. మార్కెట్లో దొరికే హెయిర్ ఆయిల్స్‌ను వాడుతుంటారు. ఎలా చేసినా వారి జుట్టు చుండ్రుతో నో..మరేదో సమస్యతోనో ఊడి పోతుంటుంది. ఆడవారు ఎంత అందంగా ఉన్నా... జుట్టు అందంతో వారికి మరింత అందం పెరుగుతుంది. కొన్ని రకాల జాగ్రత్తలతో జుట్టును ఒత్తుగా నిగనిగలాడేలా చేసు కోవచ్చు.

1. నిమ్మకాయ రసంతో తలంతా మర్ధన చేసుకున్నా కూడా చుండ్రు నివారణ అవుతుంది. 2. మందార పువ్వులను ఎండబెట్టి కొబ్బరినూనెలో వేసి మరిగించి ఆ మిశ్రమాన్ని చల్లారాక ఒక సీసాలో నిలవచేసుకుని ప్రతిరోజూ రాసుకుంటే చుండ్రు నివారణ అవుతుంది.

3. గోరింటాకు ఎండబెట్టి పొడిగా చేసుకుని కొబ్బరినూనెతో కలిపి రాసుకుంటే వెంట్రుకలు నిగనిగలాడతాయి.

4. పెరుగు, నిమ్మరసం కలిపి మిశ్రమంగా చేసుకుని వెంట్రుకలకు పట్టించినా చుండ్రు నివారణ అవుతుంది.

5. మార్కెట్లో దొరికే కలర్ డైలను ఎక్కువగా వాడకూడదు. సాధ్యమైనంత వరకూ సహజసిద్ధంగా ఉండేలా చూసుకోవాలి. మార్కెట్లో మెహిందీ పొడి దొరుకుతుంది. దానితో సహజసిద్ధమైన డైని తయారుచేసుకుంటే మంచిది. ఎటువంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు.


6. ఉసిరికపొడి కూడా జుట్టును నల్లగా మార్చడంలో ప్రముఖపాత్ర వహిస్తుంది.

7. పెద్ద ఉసిరికాయలు (ఆమ్లా) చౌకగా లభ్యమయ్యేకాలంలో వాటిని తీసుకుని ఎండబెట్టి దాని పొడిని గింజలతో సహా దంచుకుని...వాటిని తలకు పట్టిస్తే చుండ్రు, పేలు నివారణ అవుతాయి. 8. మార్కెట్లో లభ్యం అయ్యే చౌకరకాల షాంపూలను, సబ్బులను వాడితే చుండ్రు సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఏ

9. బూడిద గుమ్మడికాయ తొక్క, గింజలు కొబ్బరినూనెలో మరిగించి ఆ మిశ్రమాన్ని తలవెంట్రుకలకు రాస్తుంటే అవి సహజసిద్ధమైన మెరుపుతో తన పూర్వాకృతిని పొందుతాయి. జుట్టు మెత్తగా మారి, వెంట్రుకలు పొడవుగా అవుతాయి.

10. ఒక టీ స్పూన్ తేనే, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, టీస్పూన్ నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కోడిగుడ్డులోని తెల్లసొనని వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకి కుదుళ్ళ నుండి పట్టించాలి. 20 నిమిషాల తరువాత తల స్నానం చెయ్యాలి.

# ఆరిపోయిన లివర్ స్విచ్ వెలిగింది..!



వతీకాలేయం.. మన శరీరంలోని అన్ని అవయవాల్లోకీ పెద్దదీ, ప్రత్యేకమైనదీ. అందుకే రక్తసరఫరా విషయంలో కూడా మిగిలిన అన్ని శరీర భాగాలకు ఒకలా ఉంటే, కాలేయానికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా శరీర భాగాలన్నింటి నుంచి కార్బన్‌డయాక్సైడ్‌తో కూడిన రక్తం గుండెకు, అక్కడి నుంచి ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తుల్లో వాయుమార్పిడి ద్వారా కార్బన్‌డయాక్సైడ్ తొలగిపోయి, రక్తంలోకి ఆక్సిజన్ చేరుతుంది. ఈ ఆక్సిజన్‌యుత రక్తం తిరిగి గుండెకు చేరుతుంది. గుండె దీన్ని అన్ని శరీర భాగాలకు సరఫరా చేస్తుంది. శరీరంలో కింది వైపు ఉన్న అవయవాలన్నింటి నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా అనే అతి పెద్ద సిర గుండెకు రక్తాన్ని తీసుకువస్తుంది. అయితే జీర్ణ వ్యవస్థకు చెందిన అవయవాల నుంచి రక్తం కాలేయానికి కూడా సరఫరా అవుతుంది. ఆహారం జీర్ణం అయిన తరువాత రక్తం నుంచి పోషకాలను గ్రహించడానికి అది కాలేయానికి వెళుతుంది. ఇలా జీర్ణవ్యవస్థ నుంచి కాలేయానికి రక్తం సరఫరా అయ్యే మార్గాన్ని పోర్టల్ మార్గం అనీ, ఆ రక్తనాళాన్ని పోర్టల్ సిర అనీ అంటారు. ఇందులో తక్కువగా అంటే దాదాపు 60 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉంటుంది. అదేవిధంగా గుండె నుంచి హెపాటిక్ ధమని ద్వారా 98 శాతం ఆక్సిజన్‌ను కలిగివున్న రక్తం కాలేయానికి సరఫరా అవుతుంది.

సాధారణంగా ఏ కారణం వల్లనైనా పోర్టల్ సిర మార్గంలో ఎక్కడైనా రక్తంలో అడ్డంకులు ఏర్పడితే, మందుల ద్వారా వాటిని తొలగించి, అవసరమైన సర్జరీ చేసేస్తారు. కాని పైన చెప్పిన పేషెంటు విషయంలో ఈ అడ్డంకు పోర్టల్ సిరలో ఎక్కడో ఒకచోట అని కాకుండా మొత్తం పోర్టల్ మార్గం బ్లాక్ అయిపోయింది. దీన్ని పోర్టో - మీసెంట్రిక్ థ్రాంబోసిస్ అంటారు. దాంతో కాలేయానికి రక్తసరఫరా ఆగిపోయింది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో కాలేయ మార్పిడి చేయడం దాదాపు అసాధ్యం. విజయవంతం అయ్యే అవకాశం దాదాపుగా ఉండదనే చెప్పాలి.

సాధారణ స్థితిలో పేగుల నుంచి రక్తం పోర్టల్ సిర ద్వారా కాలేయాన్ని చేరుతుంది. అదేవిధంగా మిగిలిన శరీర భాగాల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా ద్వారా గుండెకు చేరుతుంది. ఇక్కడ ఈ రెండు మార్గాలకు మధ్య బ్రిడ్జ్ వేశార న్నమాట. అంటే కాలేయానికి, ఇన్‌ఫీరియర్ వీనకావాకి మధ్యలో ఒక బైపాస్ నాళాన్ని నిర్మించారు. దాంతో రక్తం పేగుల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావాకి, దాని నుంచి గుండెకు, తరువాత గుండె నుంచి కాలేయానికి చేరేలా రూపొందించారు. దీన్నే కావల్ ట్రాన్స్‌పొజిషన్ లేదా కావల్ స్విచ్ ఆపరేషన్‌గా వ్యవహరిస్తారు. పదమూడున్నర గంటల సుదీర్ఘ శ్రమ అనంతరం ఆపరేషన్ సక్సెస్ అయింది. కాలేయ మార్పిడి చేసినప్పటికీ కొత్త కాలేయానికి రక్త సరఫరాలో అంతరాయం లేకపోవడంతో పదిరోజుల్లో రోగి కోలుకునేందుకు వీలయింది. ఎన్ని ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసినా, ఇలాంటి సంక్లిష్టమైన, సవాలుతో కూడిన కేసు ఇదే మొదటిసారి. ఊపితిత్తులు బలహీనంగా ఉన్నప్పటికీ, వెంటిలేటర్ మీద ఉన్న రోగి ఇలా లేచి తిరగడం ఈ ఆధునిక చికిత్స ఫలితమేనంటారు ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ టామ్ చెరియన్. సిర్రోసిస్‌తో కాలేయం దెబ్బతిన్నది. కాలేయ మార్పిడి తప్ప గత్యంతరం లేదు.

కాలేయ దాత కూడా అందుబాటులో ఉన్నారు. కాని ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే పరిస్థితి లేదు. బతికినన్నాళ్లూ బతుకుతాడు.. అంతేగాని కాలేయ మార్పిడితో మరింత ప్రమాదాన్ని తెచ్చిపెట్టలేం అన్నారు డాక్టర్లు. ఏ అవయవానికైనా రక్తసరఫరా సక్రమంగా ఉంటే ఏ చికిత్స అయినా సులువుగా చేయవచ్చు. కాని రక్త సరఫరాలోనే సమస్య ఉంటే..? ఈ సమస్యనే సవాలుగా తీసుకున్నారు డాక్టర్లు. రక్తసరఫరాలో అంతరాయం ఉన్న కాలేయానికి మొట్టమొదటిసారిగా కావల్ ట్రాన్స్‌పొజిషన్(స్విచ్) విధానంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు కేర్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ టామ్ చెరియన్.

కాళ్లూచేతుల పైన రోమాలు ఎక్కువగా ఉన్నాయని బాధపడుతున్నారా? దీనిలో కూడా పాజిటివ్ చూడండి. ఇలా ఎక్కువ రోమాలున్నవాళ్లలో తెలివితేటలు, ఐక్యూ లెవల్స్ ఎక్కువగా ఉంటాయట. ఒక దశ వచ్చేవరకు మన శరీరంలోని ప్రతి భాగం పెరుగుతూ ఉంటుంది. యుక్తవయసు వచ్చిన తరువాత వీటి పెరుగుదల ఆగిపోతుంది. కాని చెవి, ముక్కు విషయంలో మాత్రం ఇలా జరగదు. వాటిలో పెరుగుదల ఆగిపోదు. వేళ్లపై ఉండే గుర్తులే (ఫింగర్ ప్రింట్స్) కాదు, నాలుక పైన కూడా టంగ్ ప్రింట్స్ కూడా ఒకరిని పోలి మరొకరికి ఉండవు. అదాదాపు 10 మిలియన్లకు పైగా వివిధ రకాలైన రంగుల షేడ్స్‌ను మన కళ్లు గుర్తించగలుగుతాయి. వాటిలో తేడా కనిపెట్టగలుగుతాయి. మన కన్ను డిజిటల్ కెమెరా లాంటిదే. ఇది 576 మెగా పిక్సెల్ సామర్థ్యాన్ని కలిగివుంది. మన శరీరంలో ఉండే బాక్టీరియా అన్నీ కలిపితే దాదాపు 4 పౌండ్ల బరువు తూగుతాయి. క్యాన్సర్లలో వందకు పైగా రకాలున్నాయి.





# చిత్రభాను

## పవన్ కొత్త సినిమా పేరు ఞ్ఞతవాసి ?



ఇప్పటికే కాన్సెప్ట్ పోస్టర్ ను రిలీజ్ చేయగా.. మరోవైపు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వయంగా పాడుతున్న ఈ పాటకు సంబంధించిన సాంగ్ ప్రోమో కూడా విడుదల చేశారు. అయితే.. %జూంజూన%25గా ప్రచారం పొందుతున్న ఈ సినిమా టైటిల్ ఏంటనే విషయంపై మాత్రం క్లారిటీ రాలేదు. జనవరి 10న రిలీజ్ అని చెప్పారు కానీ.. టైటిల్ మాత్రం చెప్పలేదు. అయితే.. ఈ మూవీ కాన్సెప్ట్ పోస్టర్ ను పరిశీలిస్తే.. టైటిల్ పై ఓ స్పష్టత వచ్చేయచ్చు. దీరెంగా ఆలోచిస్తున్న పవన్ ఫోటోతో పాటు.. నిర్మానుష్య ప్రాంతంలో ఒంటరిగా నడిచి వెళు తున్నట్లుగా ఈ కాన్సెప్ట్ పోస్టర్ కనిపిస్తుంది. ఇలా రకరకాల కొత్త విషయాలు తెలుస్తున్నాయి. అలాగే త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో పవన్ నటిస్తున్న మూవీ అప్ డేట్స్ కూడా కొన్ని తెలియచేశారు. అయితే ఈ ఞ్ఞత వాసి అనే టైటిల్ కన్‌ఫార్మా కాదా అన్నదానిమీద స్పష్టత అయితే లేదు. కానీ సోషల్ మీడియాలోనూ, ఫ్యాన్స్ గ్రూపుల్లోనూ ఈ పేరు చక్కర్లు కొడుతోంది. పవన్ కల్యాణ్ బర్త్‌డేకు చిరంజీవి సడెన్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. దీంతో అవాక్కవడం పవన్ వంతు అయింది. పవన్ బర్త్ డే సందర్భంగా అభిమానులు.. కొందరు కుటుంబ సభ్యులు.. సన్నిహితులు.. ప్రముఖులు అంతా ట్వీట్స్ చేస్తుంటే చిరు మాత్రం స్టైల్ మార్చారు. తన భార్య సురేఖతో కలిసి పవన్ మూవీ సెట్స్‌ను సందర్శించి స్వయంగా బర్త్‌డే విషెస్ తెలిపారు. దీంతో పవన్‌తో పాటు.. చిత్ర యూనిట్ కూడా ఒక్కసారిగా చిరు ఫ్యామిలీతో అక్కడికి రావడం చూసి అవాక్కయ్యారు. మెగా కుటుంబంలో ఎలాంటి విభేదాలు లేవని ఓ సందేశాన్ని అభిమానులకు ఇచ్చినట్టయిందని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇటీవల జరిగిన చిరు బర్త్‌డే సందర్భంగా పవన్ కూడా అన్నను కలిసిన విషయం విదితమే.

## ఆ బాధ ఉంది, స్పైడర్ తో సాధిస్తాను

## రకుల్ ప్రీత్ సింగ్

మొదట్లో రకుల్ ప్రీత్ సింగ్ కోలీవుడ్ లో అంతగా రాణించలేకపోయింది. పాపం ఎందుకోగానీ తమిళ ప్రేక్షకులు రకుల్ ని దగ్గరకు తీసుకోలేకపోయారు కానీ ఇప్పుడు మరో సినిమా ద్వారా కోలీవుడ్ లో క్రేజ్ పెంచుకునే ప్రయత్నం లో ఉంది ఈ బక్కపలుచ భామ. మహేష్ తో కలిసి స్పైడర్ తో ఇంకోసారి తమిళ ప్రేక్షకులని పలకరించనుంది రకుల్. ఒకరకంగా ఏఆర్.మురుగదాస్ వంటి ప్రముఖ దర్శకుడి చిత్రంలో మహేశ్‌బాబు వంటి టాలీవుడ్ సూపర్‌స్టార్‌కు జంటగా స్పైడర్ వంటి భారీ చిత్రంలో నటించే అవకాశం వరించడమే అనవచ్చు. ఈ చిత్రం ఈనెలాఖరున తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. కా గా ఇప్పటికే కోలీవుడ్‌లో కార్తీకి జంటగా ధీరన్ అధికారం ఒండ్రు చిత్రంలో నటిస్తున్న రకుల్‌ప్రీత్‌సింగ్‌కు సెల్వరాఘవన్ దర్శకత్వంలో సూర్యతో రొమాన్స్ చేసే అవకాశం వరించింది. అయితే స్పైడర్ చిత్రం విడుదల తరువాత మరిన్ని మంచి అవకాశాలు వస్తాయనే ఆశతో ఉన్న రకుల్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ కోలీవుడ్‌లో సక్సెస్ కాలేదన్న బాధ కాస్త ఉన్నా, కచ్చితంగా ఇక్కడ విజయం సాధిస్తాననే నమ్మకం తనకు ఉందని పేర్కొంది.ఇప్పుడు తన నమ్మకం వమ్ము కాలేదని తమిళంలో మంచి అవకాశాలు వస్తున్నాయని అంది.

కోలీవుడ్‌లోనూ మంచి నటిగా పేరు తెచ్చుకుంటాననే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. చిత్రపరిశ్రమలో తన స్నేహితుల గురించి చెప్పాలంటే నటుడు రానా, నటి రెజీనా చాలా క్లోజ్ ఫ్రెండ్స్ అని చెప్పింది. ఎలాంటి పాత్రలో నటిం చాలని ఆశ పడుతున్నారన్న ప్రశ్నకు ఎప్పటికైనా బాహుబలి చిత్రంలో శివగామి తరహా పాత్రలో నటించాలని కోరుకుంటున్నానని రకుల్‌ప్రీత్‌సింగ్ పేర్కొంది. స్పైడర్ లో రకుల్ ప్రీత్ చేస్తున్న పాత్ర ఓ డాక్టర్. ఇప్పటివరకూ రకుల్ చేసిన సినిమాల్లో అతి పెద్ద బడ్జెట్ మూవీ ఇదే కావడం.. బిజినెస్ పరంగా కూడా అత్యధిక క్రేజ్ ఉండడం.. తెలుగు.. తమిళ్.. హిందీ భాషల్లో రిలీజ్ కానుండడంతో.. స్పై డర్ కోసం తన సర్వ శక్తులు ఒడ్డుతోంది రకుల్ ప్రీత్. ఈ మూవీ మొత్తం ఇలా కళ్లజోడు లుక్ లోనే కనిపిస్తుందట రకుల్. మహేష్ తో పాటలు మినహాయిస్తే అనే పాయింట్ అండర్ లైన్ చేసుకోవాలి.

## జాతకాల రాంబాబు



సునిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ఉంగరాల రాంబాబు. క్రాంతిమాధవ్ దర్శకుడు. మియాజార్జ్ కథానాయిక. పరుచూరి కిరీటి నిర్మిస్తున్నారు. ఈ నెల 15న ప్రేక్షకుల ముదుకురానుంది. కాగా ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాత దిల్ రాజు వాయిస్ ఓవర్ అందించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు వాయిస్ ఓవర్ అందించారు. ఆయనతో వాయిస్ ఓవర్ చెప్పించడానికి ప్రత్యేకమైన కారణం వుంది. అదేంటనేది సినిమాలో చూడాల్సిందే. పది మందిని నవ్వించే ఓ యువకుడి కథ ఇది. రాంబాబుకు జాతకాలు అంటే మహా పిచ్చి. అలాంటి యువకుడి జీవితంలో చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో ఆద్యంతం వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. క్రాంతిమాధవ్ మార్కు భావోద్వేగాలతో పాటు సునిల్ శైలి వినోదం ఉంటుంది. ప్రకాష్‌రాజ్ కాంబినేషన్‌లో వచ్చే డైలాగ్‌లు యావత్ దేశాన్ని ఆలోచింపజేసే విధంగా వుంటాయి. మియాజార్జ్ గ్లామర్‌తో పాటు నటనకు ఆస్కారమున్న పాత్రలో నటించింది. దుబాయ్‌లో చిత్రీకరించిన పాటలు అలరిస్తాయి. ఇటీవల విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభిస్తుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గని స్థాయిలో సినిమా వుంటుంది అన్నారు. రావు రమేష్, వెన్నెల కిషోర్, ఆశిష్ విద్యార్థి, అలీ తదితరులు నటిస్తున్నారు.

## సైకలాజికల్ థ్రిల్లర్ పిజ్జా-2



విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం పురియత్ పుధీర్ తెలుగులో పిజ్జా-2 పేరుతో అనువాదమవుతున్నది. రంజిత్ జయకోడి దర్శకుడు. డీవీ సినీ క్రియేషన్స్ పతాకంపై డి.వెంకటేష్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. గాయత్రి కథానాయిక. త్వరలో విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొందరు యువకులు అమాయక మహిళలను ఎలా మోసం చేస్తున్నారో తెలియజెప్పే ఓ సామాజిక సమస్యను ఇతివ ృత్తంగా ఎంచుకొని ఈ చిత్రాన్ని రూపొందించాం. సైకలాజికల్ థ్రిల్లర్‌గా సరికొత్త అనుభూతిని పంచుతుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం అన్నారు. రమేష్ తిలక్, సోనియాదీప్తి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దినేష్‌క్రిష?న్, సంగీతం: శామ్ సిఎస్.

## పవన్ పుట్టిన రోజున 'దేవదాసి' మోషన్ పోస్టర్



రాజుగారి గది ఫేమ్ చేతన్ చీను, సుడిగాడు ఫేమ్ మోనాల్ గజ్జర్ కలిసి నటిస్తున్న చిత్రం 'దేవదాసి' త్వరలో శ్రీ లక్ష్మీ నరసింహ సినీ చిత్ర బ్యానర్ లో ప్రారంభం కానుంది. ఈ రోజు పవన్ కళ్యాణ్ గారి పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ చిత్రానికి కథ మాటలు దర్శకత్వం మధురావు మాదాసు. ప్రస్తుతం ఎందరో షార్ట్ ఫిల్మ్ మేకర్స్ వెండి తెరపై తమ అద్ర ృష్టాన్ని పరీక్షించుకుంటున్న తరుణంలో ఈ షార్ట్ ఫిల్మ్ మేకర్ కూడా తన అద ృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఈ చిత్రానికి ఛాయాగ్రహకుడిగా తోట. బాలక ృష? పనిచేస్తున్నారు. ఇతను గతంలో బాహుబలి 1 కు ఆపరేటివ్ కెమెరా మెన్ గా పని చేసి ఆ తరువాత ఫైట్ మాస్టర్ పీటర్ హేన్స్ తీస్తున్న ఇంటర్నేషనల్ మూవీకి డీ.ఓ.పి గా పని చేసిన అనుభవం ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్ గా ప్రముఖ సీనియర్ ఎడిటర్ గౌతంరాజు గారు. సంగీతం 'యాజమాన్య', కొరియోగ్రఫీ శివశంకర్ మాస్టర్ మరియు విజయ్. రచనా సహకారం ఎ. వి. యస్. ఆదినారాయణ... ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్ మొన్న వినాయక చవితి పండుగ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేయటం జరిగింది. ఈ మోషన్ పోస్టర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. మొట్టమొదటి సారిగా ఒక మోషన్ పోస్టర్ ను ప్రేక్షకులు దర్శకుడిని హీరో ని మెచ్చుకుంటూ రివ్యూస్ వ్రాయడం తెలుగు లో బహుశా ఇదే మొదటిసారి అనుకుంట. అయితే మోషన్ పోస్టర్ చివరిలో గజ్జెలు పట్టుకుని కూర్చున్న దేవదాసి పాత్ర పోషించిన అమ్మాయి ఎవరు అనేది చిత్ర యూనిట్ బహిర్గతం చేయకపోవడంతో ప్రేక్షకులలో ఆమె ఎవరు అని ఆసక్తి నెలకొంది.

# వరుణ్ బజాజ్‌లో ఘనంగా 25వ వార్షికోత్సవ సంబరాలు

**తెలుగు రాష్ట్రాలలో వరుణ్ బజాజ్‌కు నెం. 1 బ్రాండ్ ఇమేజ్**
**వార్షికోత్సవం, మరియు దసరా సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు**
**కస్టమర్లకు ఉత్తమ సేవలందించడమే వరుణ్ గ్రూప్ విజయ రహస్యం**
**వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్**




వరుణ్ బజాజ్ 25వ వార్షికోత్సవ ఆఫర్ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ చైర్మన్ ప్రభు కిషోర్, సిఇఓ ఆడారి శ్రీనివాస్ సిబ్బంది, తదితరులు

విశాఖపట్నంః భారతదేశపు నం. 1 బజాజ్ డీలర్ వరుణ్ బజాజ్ 25వ వార్షికోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్ 25వ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆటో మొబైల్ రంగ డీలర్‌షిప్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని వరుణ్ ఒక బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకుంది. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిషోర్ మాట్లాడుతూ వరుణ్ బజాజ్ 25వ వార్షికోత్సవం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని, వరుణ్ బజాజ్ 25 సం.ల క్రితం విశాఖలో చిన్న శాఖగా ప్రారంభించబడి, నేడు అభివృద్ధి పథంలో కొనసాగుతూ, నేటికి రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా భారత దేశంలోనే అతిపెద్ద బజాజ్ డీలర్‌గా వరుణ్ గ్రూప్ రూపాంతరం చెందింది. వినియోగదారులకు తమ సంస్థ విస్తృత సేవలను అందించడం జరుగుతోందన్నారు. లక్షలాదిమంది వినియోగ దార్ల అభిమానం పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వరుణ్ బజాజ్ సీఈఓ ఆడారి శ్రీనివాస్ మాట్లాడుతూ దసరా మరియు వార్షికోత్సవం సందర్భంగా వరుణ్ బజాజ్ కస్టమర్లకు పలు ఆఫర్లను ప్రకటించిందన్నారు. ప్రతీ బజాజ్ కొనుగోలుపై స్క్రాచ్ కార్డ్‌ను అందిస్తున్నామని, ఇందులో భాగంగా గోల్డ్‌కాయిన్ లేదా రూ. 1250 నుండి 2500 వరకు నగదు కస్టమర్లు ఖచ్చితంగా పొందే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అతి తక్కువ డౌన్‌పేమెంట్‌కే రూ. 10,000లకే సిటి 100, రూ. 10,000లకే ప్లాటిన, రూ. 13,000లకే డిస్కవర్125, రూ. 16,000లకే పల్సర్ 150, రూ. 20,000లకే పల్సర్ ఎన్ఎస్160లను సొంతం చేసుకునే అవకాశాన్ని ఇచ్చామని తెలియజేశారు.

పాత 2 వీలర్‌కు ఎక్స్ఛేంజ్‌లో మార్కెట్ ధరకంటే రూ. 2,000 అధిక ధర, చెక్కులు లేకుండానే ఫైనాన్స్ సౌకర్యం, స్పాట్ ఎక్స్ఛేంజ్, స్పాట్ ఫైనాన్స్, స్పాట్ అప్రూవల్ సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ ఆఫర్ అక్టోబర్ 5వ తేదీ వరకు మాత్రమే లభిస్తాయని, కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఇఓ శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్ బజాజ్ కస్టమర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్
# జూడో ఛాంపియన్‌షిప్ ప్రారంభం

విజయవాడ: ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల్లో ప్రవేశ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జూడో ఛాంపియన్‌షిప్ ప్రారంభ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు సాధన చేసి ఆరోగ్యంగా ఉన్న వారు జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకుంటారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా నవ్వుతూ జీవించాలనే లక్ష్యంతో రాష్ట్ర క్రీడా ముసాయిదాను రూపొందించమన్నారని, దేశ వ్యాప్తంగా ఈ క్రీడా ముసాయిదా అందరికీ మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి జూడో ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు హాజరవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశ్రాంత డీజీపీ ఎంవీకృష్ణారావు జూడో క్రీడా విశేషాలను వివరిస్తూ..ర్యాగింగ్ నుంచి తట్టుకునేందుకు, ఆత్మరక్షణకు బాగా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ , శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ, డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి అర్జా పాండురంగారావు, రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు శ్రీహరినాయుడు ప్రసంగించారు. అనంతరం అతిథులు అధికారికంగా ఛాంపియన్‌షిప్ ప్రారంభించినట్లు ప్రకటించారు. రాష్ట్ర జూడో సంఘం అధ్యక్షుడు నామిశెట్టి వెంకట్ , రాష్ట్ర సంఘం కార్యదర్శి కేఎన్‌బాబు, కోశాధికారి శేషగిరి, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకట రాఘవేంద్రరావు, జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు సీహెచ్‌మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ కుటుంబం నుంచే..
# వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా
### అడిగర్ల అప్పలనాయుడు (నానిబాబు)

గొలుగొండ / నర్సీపట్నం : వ్యవసాయ కుటుంబం నుంచి నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సీపట్నం నియోజకవర్గ, గొలుగొండ మండల జోగుంపేట గ్రామం నుండి అడిగర్ల అప్పలనాయుడు (నానిబాబు) ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆశీస్సులతో ఈ పదవి వరించినట్లు అతని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేడు వ్యవసాయశాఖా మంత్రి ఆదినారాయణరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్పీటీసీలు,పార్టీ నాయకులు హాజరు కానున్నారు. మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన మార్కెట్ కమిటీ సభా వేదిక పై ఆశీనులు కాగా చైర్మన్ హోదాలో మొదటి ప్రసంగాన్ని నానిబాబు చేయనున్నారు.


అడిగర్ల అప్పలనాయుడు

జోగుంపేట గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నానిబాబు కుటుంబంలో రాజకీయగతం లేదు. మంత్రి అయ్యన్నపాత్రుడు ఆశీస్సులతో పార్టీ క్రియాశీలక సభ్యుడుగా నమోదయ్యారు. చోద్యం పిఎసిఎస్‌కి అధ్యక్షులుగాను, మండల పరిషత్ అధ్యక్షులుగానూ మండల పార్టీ అధ్యక్షులు గానూ నాటి నుండి నేటివరకు అయ్యన్న మాట జవదాటకుండా అయ్యన్న, పద్మావతి దంపతులు సూచనలతో మండలాన్ని పటిష్ఠపరచడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారు. చైర్మన్ పదవి ఎన్నిక విషయంలో మంత్రి అనేక ఒత్తిడికి గురయినా సరైన నిర్ణయమే తీసుకున్నారని నాలుగు మండలాల పార్టీ నాయకులు సంతృప్తిలో ఉన్నారు.

భారీ కటౌట్లతో స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు మేలు పొందే దిశగా నూతన విధానాలకు మంత్రి ఆశీస్సులతో నడుచుకుంటానని ఆయన శనివారం విలేకరులకు తెలిపారు.

జాతీయ పోషకాహార వారోత్సవం
1-7 సెప్టెంబరు 2017
ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం
सत्यमेव जयते
శిశువులు & చిన్న పిల్లలకు ఆహారమిచ్చు సరైన పద్ధతులు (ఐవైసిఎఫ్)
మెరుగైన పసిపిల్లల ఆరోగ్యం
MAA Mothers' Absolute Affection
एक संकल्प



తల్లి పాలు
మొట్టమొదటి సంపూర్ణ వ్యాక్సిన్ - రోగ నిరోధకతను పెంచుతుంది

- మెదడు అభివృద్ధిని సహకరిస్తుంది
- సరైన పోషకాలను అందిస్తుంది
- పిల్లలను న్యూమోనియా మరియు డయేరియా నుంచి కాపాడుతుంది
- శిశువు మరియు తల్లికి అంటువ్యాధులు కాని వ్యాధుల ప్రమాదమును తగ్గిస్తుంది
- శిశువు మరియు తల్లి మధ్య మెరుగైన బంధం

- శిశువు జన్మించిన 1 గంటలోపు తల్లిపాలు ఇవ్వాలి
- మీ శిశువుకు కేవలం తల్లిపాలు అవసరం కాబట్టి మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు ఇప్పించాలి & కనీసం నీరు కూడా అవసరం లేదు
- శిశువుకు 6 నెలలు పూర్తైన తర్వాత తల్లిపాలతో పాటు పరిపూరక ఆహారం అందించండి.
- కనీసం 2 సంవత్సరాల తల్లిపాలను ఇవ్వండి
- అనారోగ్యంగా ఉన్నపుడూ కూడా పాలివ్వడం కొనసాగించండి.

తల్లి పాలివ్వడం...
ఒక నిబద్ధత, ఒక ఎంపిక కాదు

davp 17102/13/0024/1718
NATIONAL HEALTH MISSION
@MoHFW_INDIA
YouTube mohfwindia
www.mohfw.nic.in
www.pmindia.gov.in
www.mygov.in

VIJAYABHANU - Vijayawada
Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at VIJAYABHANU PRESS, D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ★ e-mail: vijayabhanudaily@gmail.com